ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యకలాపములు

# ANDHRA PRADESH
# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

## OFFICIAL REPORT

బుధవారము 9 ఆగస్టు, 2000

Wednesday, The 9th August, 2000

వాల్యూం -- 4, నంబరు -- 1

శకసంవత్సరము 1922 -- శ్రావణం --18

VOL -- 4, NO. -- 1

18 - Sravan, 1922 - S.E.


శాసనసభ సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.

LEGISLATURE SECRETARIAT
PUBLIC GARDENS
HYDERABAD
500 004.


ఆంధ్రప్రదేశ్ శాసనసభ

ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీమతి కె. ప్రతిభా భారతి |
| ఉప సభాపతి | : | శ్రీ కె. చంద్రశేఖరరావు |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ ఎం .వి. కృష్ణారావు |
| | | శ్రీమతి బి. శోభానాగిరెడ్డి |
| | | శ్రీ పి. రాములు |
| | | శ్రీ సి. ముత్యంరెడ్డి |
| | | శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్ |
| | | డా.ఆర్. రవీంద్రనాథ్ రెడ్డి |
| కార్యదర్శి | : | శ్రీ కె. తుల్జానంద్ సింగ్ |
| సంయుక్త కార్యదర్శులు | : | శ్రీ బి. వి. శర్మ |
| | | శ్రీ టి.వి. సత్యనారాయణ |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ ఆర్. భాస్కరన్ |
| | | శ్రీ ఎస్. వి. రామిరెడ్డి |
| | | శ్రీమతి వి. జయకుమారి |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీమతి ఇందిరాగాంధి |
| | | శ్రీ పి.కాశిరాజు |
| | | శ్రీ కె. హరినారాయణ రావు |
| | | శ్రీ పి. వెంకటరామారావు |
| | | శ్రీ ఎం .ఎ.సిద్దిఖీ |
| | | శ్రీ ఎస్.ఆర్.సి. నర్సరాజు |
| | | శ్రీ బి. పద్మారెడ్డి |
| | | శ్రీ మహమ్మద్ దావూద్ అలీ |
| | | శ్రీ జి. ఎస్. గోపాలకృష్ణ |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ ఎస్. రాజ సదారామ్ |

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

అధికార నివేదిక

(పదకొండవ శాసనసభ)

( మూడవ సమావేశము : మొదటి రోజు )

( గౌ. సభాపతి గం . 10.00 అధ్యక్షస్థానములో వున్నారు )

విషయ సూచిక

సంతాప ప్రపాదన
గౌ. సభ్యులు శ్రీ పి. ఇంద్రారెడ్డి గారి మృతిపట్ల

## సంతాప ప్రతిపాదన

## గౌ. సభ్యులు శ్రీ పి. ఇంద్రారెడ్డి గారి మృతిపట్ల

SRI N. CHANDRABABU NAIDU: Madam, I beg to move:

"That this House places on record its deep sense of sorrow at the demise of Sri P. Indra Reddy, Member of the Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to themembers of the bereaved family".

MADAM SPEAKER: Motion moved

శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడుః అధ్యక్షా, రాష్ట్ర మాజీ మంత్రి చేవెళ్ల శాసన సభ్యుడు – కాంగ్రెస్ పార్టీ శాసన సభా పక్ష కార్యదర్శి పి. ఇంద్రారెడ్డిగారు ఈ సంవత్సరం ఏప్రిల్ 21వ తారీఖు రాత్రి ఒక మీటింగు చూసుకుని షాద్‌నగర్ నుండి కారులో వస్తూ వుండగా హైదరాబాద్ దగ్గరలో

రంగారెడ్డి జిల్లా పాలమాకుల గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో చనిపోవడం జరిగింది. దానికి ఆ కుటుంబ సభ్యులకు నేను ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఇంద్రారెడ్డిగారు 1956వ సంవత్సరం అక్టోబర్ 4వ తేదీన రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల మండల పరిధిలో వున్న కౌకుంట్ల గ్రామంలో జన్మించారు. 1978వ సంవత్సరంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం . ఎ. పూర్తి చేశారు. 1981వ సంవత్సరంలో న్యాయశాస్త్ర విద్యను కూడా అభ్యసించారు. అదే మాదిరిగా 1981వ సంవత్సరంలో కౌకుంట్ల గ్రామ సర్పంచిగా పోటీ చేసి ఎన్నికవడం జరిగింది. ఆ తరువాత ఆయన లోక్‌దళ్‌లో కొన్ని రోజులు యాక్టివ్‌గా వుంటూ తరువాత 1985వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీలో చేరి మధ్యంతర ఎన్నికలలో తొలిసారిగా శాసన సభ్యుడు అయ్యారు. తరువాత 1989వ సంవత్సరం మరియు 1994వ సంవత్సరం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గెలిచారు. అటు పిమ్మట 1999వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చేవెళ్ల నియోజక వర్గం నుంచి ఎన్నిక కావడం జరిగింది. 1985వ సంవత్సరం నుంచి 1989వ సంవత్సరం వరకు పాఠశాల విద్యాశాఖ మంత్రిగా మరియు కార్మిక ఉపాధి శాఖామంత్రిగా పని చేశారు. అదే మాదిరిగా 1994వ సంవత్సరంలో హోమ్ శాఖా మాత్యులుగా పని చేయడం జరిగింది. 1999వ సంవత్సరం నుంచి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ కార్యదర్శిగా కూడా వున్నారు. ఆ విధంగా వారు నాకు బాగా పరిచయము. అందరం కలిసి పని చేశాము. ఏ కార్యక్రమాలలో అయినా చాల చురుకుగా పని చేసే వ్యక్తి ఇంద్రారెడ్డిగారు. చాలా చొరవగా కూడా వుండే వారు. ఏ పని అనుకున్నా అది సాధించే వరకు నిద్ర పోకుండా పని చేసే వారు. రంగారెడ్డి జిల్లాలో నాకు ఒక అనుభవం వున్నది. జిల్లా పరిషత్ ఎన్నికలలో ప్రస్తుత హోమ్ మంత్రిగారు అప్పుడు జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కంటెస్ట్‌చేశారు. ఆ ఎన్నికల సమయంలో ఇంద్రారెడ్డి కాలు ఫ్రాక్చర్ అయి చాలా బాధలో వున్నా కూడా నాతో కలిసి అన్నిమండల్ హెడ్ క్వార్టర్స్‌లోని గ్రామ, గ్రామానికి తిరిగిన వ్యక్తి అని తెలియజేసుకుంటున్నాను. ఏదయినా ఒక పనిని సాధించాలనుకుంటే దానికి ఎలాంటి అడ్డంకులు వచ్చినా సాధించాలనే డిటర్మినేషన్‌తో ముందుకు వెళ్లే వ్యక్తి. ఆ విధంగా పార్టీ మీటింగులలోనే గాకుండా చాలా సార్లు కలిసి పని చేసే అవకాశం చాలా సంవత్సరాలుగా వుండేది. ఆ విధంగా అన్ని కార్యక్రమాలలో కూడా చాలా చురుకుగా పని చేసి ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాకు కానీ, రాష్ట్రానికి కానీ ఎనలేని సేవలు అందించారని తెలియజేసుకుంటున్నాను. ఆ విధంగా మంత్రిగానే గాకుండా శాసన సభ్యుడిగా పార్టీలో రూలింగ్‌లో వున్నా, అపోజిషన్‌లో వున్నా ఎప్పుడు కూడా తాను నమ్మిన సిద్ధాంతం కోసమే గాకుండా పేద ప్రజల యొక్క అభివృద్ధి కోసం నిరంతరం పని చేయడం జరిగింది. అలాంటి వ్యక్తి అతి చిన్న వయస్సులో 45 సంవత్సరాలకే హఠాత్తుగా మరణించడం మనందరికి బాధాకరం, రాష్ట్రానికి తీరని లోటు. ఆ విధంగా వారు చేసిన సేవలను ఎప్పటికి కూడా మరచిపోలేము. వారు ఎప్పుడు అసెంబ్లీకి వచ్చినా చాలా హుషారుగా నవ్వుతూ అందరితో కలుపుగోలుగా మాట్లాడుతూ వుండేవారు. అలాంటి వ్యక్తి ఈ అసెంబ్లీలో మనకు లేకుండా పోవడం చాలా బాధాకరం . వారి సతీమణి ఎంఎల్ఏ అయ్యారు . వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను .

డా. వై. యస్ . రాజశేఖర రెడ్డి: అధ్యక్షా, నిజంగా డైనమిజం అనే పదానికి నిర్వచనం ఇంద్రారెడ్డిగారే. వారు ఎక్కడ ఏ పని చేస్తూ వున్నా చాలా ప్రత్యేకంగా వుండేవి వారి యాక్టివిటీస్ . ఒక సిద్ధాంతాన్ని నమ్ముకుంటే , చివరి దాకా పోరాడడంలో ఏమాత్రం వెనుకాడని వ్యక్తి ఆయన. ఇంద్రారెడ్డిగారు దాదాపు గడచిన 15 సంవత్సరాలుగా నాకు పరిచయం . వారు ఎడ్యుకేషన్ మినిస్టర్‌గా వున్నప్పుడు – దాదాపు 1986 ఆప్రాంతంలో – ఒక చిన్న పని కోసం వారికి ఫోన్ చేసి చెప్పాను. నేను అప్పుడు శాసనసభ్యుడిగా వుండే వాడిని . వారు ఆ చెప్పిన పని పూర్తి చేయడమే కాకుండా చేశాను అని చెప్పే ఒక మంచి ఆనవాయితీ వున్న మనిషి . నాకు ఇంద్రారెడ్డి గారికి ప్రత్యేకంగా ఒక మంచి ర్యాపోర్ట్ డెవలప్‌అయి వున్నది . ఇంద్రారెడ్డి గారు చనిపోయినప్పుడు నేను నా స్వంత ఇంటిలోని మనిషి చనిపోయినట్లు అనుకున్నాను. అటువంటి ప్రేమాభిమానాలు పొందగలిగిన వ్యక్తిత్వం ఇంద్రారెడ్డి గారిది. అలాంటి ఇంద్రారెడ్డిగారు మనకు లేకపోవడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు . కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ కార్యదర్శిగా ఆయన మాకే కాకుండా అందరికీ తలలో నాలుకగా వుండే వారు. కేవలం స్వంత పార్టీ అనుకోకుండా అందరితో కూడా సుహృద్భావంతో స్నేహాన్ని నెలకొల్పుకునేవారు . 1994వ సంవత్సరంలో ఆయన మూడవసారి ఎన్నికయ్యారనుకుంటాను. ఆ తరువాత వారు మంత్రిగా వుంటూ కూడా, 1995 ఆగస్టు మాసంలో రామారావుగారు దిగిపోయిన తరుణంలో చాలామంది శాసనసభ్యులు రామారావుగారితో లేకపోయినా, ఇంద్రారెడ్డి గారు మాత్రం చివరివరకూ ఆయనతోనే వున్నారు. తాను నమ్ముకున్న సిద్ధాంతం పట్ల వారికి పూర్తి విశ్వాసం వుండి, ఆ పార్టీలోనే కొనసాగారు . ఆ పార్టీ పూర్తిగా కనుమరుగయ్యేంతవరకు అదే పార్టీని అంటిపెట్టుకొని వున్నారు. అటువంటి ధైర్యం, పట్టుదల ఒక ప్రత్యేకత నిలబెట్టుకోగలిగిన వ్యక్తి ఆయన . ప్రత్యేక తెలంగాణా కోసం – తెలంగాణా వెనుకబాటుతనం పోవాలని – అన్నిరకాల మేలు జరగాలని ఒక ప్రత్యేకమైన శ్రద్ధాసక్తులతో ఆయన పని చేసిన విషయం మనందరికి తెలుసు . అటువంటి ఇద్రారెడ్డిగారు మనకు లేకపోవడం చాలా బాధాకరమైన విషయం . ఏదియేమయినా, ఇంద్రారెడ్డి గారు మనకు లేకపోయినా ఆయన భార్య ఈనాడు చేవెళ్ల శాసనసభ్యురాలిగా ఆయనలేని లోటును తప్పకుండా భర్తీ చేస్తుందనే నమ్మకం మాకు వున్నది . ఇంద్రారెడ్డిగారు చనిపోయిన చాలా స్వల్ప వ్యవధిలోనే వారి సతీమణి బాధాకరమైన హృదయంతో ఎన్నికలకు పోటీ చేయవలసి వచ్చింది. ఏదియేమయినా ఎన్నికల్లో ఆమె మంచి మెజారిటీతో గెలుపొందారు . తప్పనిసరిగా ఆమె చేవెళ్ల వాసులకైతేనేమి, మాకైతేనేమి ఇంద్రారెడ్డిగారు లేని లోటు భర్తీ చేస్తారనే నమ్మకం మాకు వుంది . భగవంతుడు ఆమెకు, ఆమె పిల్లలకు పూర్తిగా అన్ని రకాలైన మేలు చేయాలని కోరుకుంటూ , ఇంద్రారెడ్డి గారి కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను .

ఉ. 10. 10

శ్రీ యస్. ఇంద్రసేనారెడ్డి: అధ్యక్షా, ఇంద్రారెడ్డి గారు విద్యార్థి దశలో, సిటీ కాలేజ్‌లో విద్యార్థిగా వున్నప్పటి నుండి, ఆ తరువాత యూనివర్సిటీ విద్యార్థిగా వున్నప్పుడు కూడా విద్యార్థి నాయకునిగా వుండే వారు. 1975లో ఎమర్జెన్సీ కాలంలో నాతోబాటు వారు కూడా ఎక్స్‌ట్రీమిస్ట్ కార్యకలాపాల్లో పాల్గొనడం, స్టూడెంట్ దశలోనే నాతోబాటు జైల్లో వుండడం జరిగింది. ఆ రకంగా వ్యక్తిగతంగా కాలేజ్ డేస్ నుండి ఇంద్రారెడ్డి గారు నాకు బాగా పరిచయం వున్న వ్యక్తి. మిగతా సభ్యులు చెప్పినట్లుగా మొదటినుండి కూడా బలహీనవర్గాల కొరకు , వెనుకబడిన ప్రాంతాల యొక్క అభివృద్ధి కొరకు వారు పని చేశారు. ఎవరు తన వెనుక వున్నా లేకపోయినా, ' నేను లీడర్‌ను అవుతాను. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేస్తాను ' అనే పద్ధతిలో చేవెళ్ల నియోజకవర్గంలో పోటీ చేస్తూ, మొట్టమొదట పోటీ చేసినప్పుడు ఓడిపోయినా, ఆ తరువాత వారు కంటిన్యుయస్‌గా గెలుస్తూ వుండడం జరిగింది. వారిలో వుండే ప్రత్యేకత ఏమంటే , వారు ఎవరినైనా సరే అన్నా అని పిలిచి, ఎంతో ఆప్యాయతతో వ్యవహరించేవారు. నేను పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అక్కడకు వెళ్లినప్పుడు , ఆయన ప్రతి వారితో మమ్ములను పరిచయం చేసి, వీరు మీ పనులు చక్కగా చేస్తారని చెప్పేవారు. 1985 నుండి 1989 వరకు జిల్లాపరిషత్‌లో వున్నప్పుడు కానీయండి, చేవెళ్ల నియోజకవర్గానికి సంబంధించి కానీయండి డెవలప్‌మెంట్ విషయాల్లో ఎంతో కృషి చేశారు. వెనుకబడిన తెలంగాణా ప్రాంతంలో ఎదుగుతున్న నాయకుడు అనుకోకుండా ఏప్రిల్ 21 వ తేదీ నాడు చనిపోవడమనేది చాలా బాధాకరమైన విషయం . వారి కుటుంబానికి నా ప్రగాఢమైన సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

SRI ASADUDDIN OWAISI: Madam Speaker, I was shocked when I heard the sad news of the death of Sri P. Indra Reddy. I rise with heavy heart to express my deep sense of sorrow at the sudden demise of Sri P. Indra Reddy. Late Sri Reddy was a great friend of mine and he was one of the few MLAs who had the great qualities of fearlessness and taking bold initiative. I believe we will never see such a great dynamic leader in the State. He had the rare image of fighting with the government fearlessly and diligently for the upliftment of the weaker sections of the society in his constituency.

Madam Speaker, before his sudden demise, we had a meeting at Rajendranagar Municipality whereunder, my, the Charminar, constituency also falls and it was a first meeting of the elected Councillors and Chairman of that municipality. During that meeting, Sri P. Indra Reddy had so many ideas and he wanted to do lot of developmental works for his Chevella constituency in Ranga Reddy district. During that meeting, he had also given some proposals for the development of Vikarabad and Tandur and in this regard he had suggested to

: :

the elected Councillors and Chairman to fight with the government without any fear and see that as many funds as could be possible should be brought in. I feel

that his sudden death is a personal loss to me. He was one of the bravest leaders in the State who had never felt shy in politically fighting with the government and his last election victory was a testimony in spite of many odds. He was always hopeful about his victory.

Madam Speaker, it is also a great loss to the people of the region of Telangana. The Telangana region has lost two of its great leaders within a span of just one month - late Sri A. Madhava Reddy and now late Sri P. Indra Reddy. I sincerely believe that his wife who has recently been elected as the Member of this august House, will carry forward his vision and ideas so that justice can be done to his constituency. I on behalf of myself and my party, once again express my sympathy and condolence to the family members of late Sri P. Indra Reddy.

శ్రీ నోముల నర్సింహయ్య: అధ్యక్షా, 1978 నుండి 1981 వరకు ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్‌లో ఇంద్రారెడ్డిగారు తోటి విద్యార్థిగా , రూంమేట్‌గా నాతో వుండడం జరిగింది . వారిని మరచిపోలేని విషయం వాస్తవం . వయసుతో నిమిత్తం లేకుండా ఎంత చిన్న వారయినా సరే ' అన్నా ' అని పలకరిస్తూ ఆలింగనం చేసుకునే మంచి వ్యక్తి ఇంద్రారెడ్డి గారు. ఆయన మన మధ్య లేకపోవడం విచారకరం . ఆయన చేసిన సేవలు ఏనాడూ మరువలేనివి. వారు ప్రతినిత్యం ప్రజల కోసం ఏదో ఒక పని చేయాలనే తపనలో తిరుగుతూ వుండేవారనేది వాస్తవం . కాచిగూడా హైస్కూల్‌లో విద్యార్థిగా వున్నప్పటి నుండి సోషల్‌వెల్ఫేర్ హాస్టల్స్‌లో విద్యార్థులను సమీకరించి , అభ్యుదయ భావాలతో హాస్టల్ వసతుల మెరుగుదల కోసం కృషి చేశారు . ఆ రకంగా ఆయన నాయకుడిగా ఎదిగారు. లా కాలేజ్‌లో అధ్యక్షునిగా ఎన్నికైన విషయం వాస్తవం . ఏదియేమైనప్పటికీ ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో ఆయన మన మధ్య లేకపోవడం ఎంతో లోటుతో కూడిన విషయం . ఎంతో మంచి హృదయంతో ఈ రాష్ట్రాన్ని ఎంతో ముందుకు తీసుకుపోవాలని ఆలోచించే వారిలో ఒక వ్యక్తిగా వున్న సోదరుడు ఈనాడు మన మధ్య లేనందుకు ఎంతో చింతిస్తూ, వారి కుటుంబానికి మా సిపిఐ (యం) పార్టీ పనిచేసేవారు . ముఖ్యంగా చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం వారు బాగా పనిచేశారు . వారు తరఫున మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను .

శ్రీ టి. దేవేందర్ గౌడ్: మేడం స్పీకర్, ఈరోజు ఈ విధంగా ఇంద్రారెడ్డి గారి సానుభూతి సభ ఈ హౌస్‌లో పెట్టవలసి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. ఇది చాలా దురదృష్టకరమైన విషయం . గత ముప్పది సంవత్సరాలుగా ఆయన నాకు ఒక మంచి స్నేహితునిగా వుండే వారు. మేమిరువురం ఇంటర్‌మీడియేట్ ఒకే కాలేజ్‌లో చదువుకున్నాం . ఆయన నాకంటే ఒక సంవత్సరం జూనియర్ . ఆయన రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఎంతో చురుగ్గా తిరిగి చిన్నప్పటి నుండి బాగా కష్టపడి పైకి వచ్చారు. ఎంతో కష్టపడి, ఎన్నో రకాల ఇబ్బందులను ఎదుర్కొని, చాలా స్ట్రగుల్ చేసి పైకి ఎదిగిన వ్యక్తి ఆయన . ఆ రకంగా ఏవిధంగాను అధైర్యపడకుండా ఆయన ముందుకు కొనసాగుతూ పోయారు. ఆయనను మనం మరచిపోలేము . ఆయన చిన్న విషయం అయినా సరే సీరియస్‌గా తీసుకొని ఆ పని సక్సెస్ అయ్యేవరకు నిద్రపోయేవారు కాదు . ఆయన

రేయింబవళ్లు తిరుగుతూ వుండేవారు . నేను చాలా సందర్భాల్లో రాత్రంతా తిరగడం ఎందుకని గట్టిగా చెప్పే వాడిని . ఇంతకుముందు గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా జిల్లా పరిషత్తు ఎన్నికల నుండి వారు రాజకీయంగా తెలుసు . అంతకుముందు కుటుంబపరంగా పరిచయాలు వున్నా , పొలిటికల్‌గా జిల్లా పరిషత్ ఎన్నికల్లో ' నువ్వు నిలబడితే బాగుంటుంది ' అని చెప్పి నన్ను పరిచయం చేసి ఎలక్షన్స్‌లో నిలబెట్టడవే ం . కాకుండా ాగా కష్టపడి వారు నా గెలుపు కోసం కృషి చేశారు.

ఉ.10.20.

ఆ రోజున ఆయన కాలికి దెబ్బ తగిలిన కూడ , బాగా తిరిగి పని చేసిన వ్యక్తి. ఆ విధంగా చాల కష్టపడి అన్ని రకాలుగా, అన్ని రంగాల్లో కూడ అందరినీ కలుపుకొని తిరిగే వ్యక్తి. నేను ఎప్పుడూ ఊహించలేదు . సరే, రాజకీయంగా కొన్ని విభేదాలుంటాయి. ఎవరి ఆలోచనలు వారివి, ఎవరి అవకాశాలు వారివి. ఎన్ని విభేదాలున్నా, వ్యక్తిగతంగా మనిషి ఎప్పుడూ ఎంతో సన్నిహితంగా, స్నేహపూర్వకంగా ఉండేవారు. చిట్టచివరిగా గత సమావేశాల సందర్భంగా మేము అసెంబ్లీ కారిడార్‌లో కలుసుకొని, పరస్పరం కుటుంబ విషయాలు గురించి మాట్లాడుకోవడం జరిగింది. అదే మా యొక్క చివరి సమావేశం .ఆ తరువాత మళ్లీ మాట్లాడుకోవడానికి అవకాశం చిక్కలేదు. ఆ విధంగా వారు చనిపోయిన సంఘటన సడన్‌గా మాకు తెలిసేసరికి మా కుటుంబ సభ్యులందరం కూడ చాల బాధపడ్డాం . ఏమిటి ఇలా జరుగుతున్నది--రెండు నెలల తేడాలోనే మాధవరెడ్డిగారు, ఆ తరువాత వెంటనే ఇంద్రారెడ్డిగారు చనిపోవడం అని. ఆ విధంగా వెంట వెంటనే ఇద్దరు నాయకులను కోల్పోవడం మాకు ఎంతో బాధ కల్గించింది. వారి కుటుంబానికి తీరని లోటు. ముఖ్యంగా వారి పిల్లలకు. వారికి ముగ్గురు పిల్లలున్నారు. వారికి మనోధైర్యం భగవంతుడు ఇవ్వాలని కోరుతూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. మా జిల్లా ప్రజలంతా కూడ ఒక మంచి లీడర్‌ను కోల్పోయామని చెప్పి ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

డా. జి. కుతూహలమ్మ: అధ్యక్షా, గౌ. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన స్వర్గీయ ఇంద్రారెడ్డిగారి యొక్క సంతాప తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను.

మొన్నటి వరకు మన మధ్య శాసనసభ్యులుగా ఉండి, అంతకుముందు మంత్రిగా, మా కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్ష కార్యదర్శిగా ఉన్న సోదరుడు ఈ రోజు మన మధ్య లేకపోవడం , ఆయన సంతాప తీర్మానాన్ని మనం ఈరోజున ఈ శాసనసభలో ప్రవేశపెట్టడం చాల బాధాకరమైన విషయం . అధ్యక్షా, 1985లో మధ్యంతర ఎన్నికలు వచ్చినపుడు, స్వర్గీయ ఎన్ టి .రామారావుగారి ప్రభంజనం వీస్తున్నప్పుడు , వారు, నేను ఒకేసారి ఈ శాసనసభకు రావడం జరిగింది . అప్పట్లో మా కాంగ్రెస్ పార్టీలో 50 మంది శాసనసభ్యులుండగా, నేను ఒక్కదానినే లేడీ మెంబర్‌గా ఉన్న సందర్భంలో, ప్రణాళికా బోర్డు వ్యవస్థ కొత్త గా వచ్చిన సమయంలో ఆయన మా జిల్లాకు మొట్టమొదటి ప్రణాళికా బోర్డు ఛైర్మన్‌గా వచ్చారు. తెలుగుదేశం ప్రభంజనం రాష్ట్రంలో వీస్తున్నప్పుడు, తెలంగాణా సైడ్ నుండి

ప్రణాళికా బోర్డు ఛైర్మన్‌గా ఆయన్ని వేసినప్పుడు, ఆయన మాకు సహకరిస్తారా అనే అనుమానం ఉండేది. అయితే ఆయన పార్టీలకు అతీతంగా, అభివృద్ధినే దృష్టిలో పెట్టుకొని, మా అందరితో సహకరించి,మా జిల్లా అభివృద్ధి చేస్తూ, వారి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకొంటూ , ఎంతో పారదర్శకంగా వ్యవహరించారు. ఆ తరువాత మళ్లీ మొన్న మా పార్టీ శాసనసభ పక్ష కార్యదర్శిగా ఉండి, అందరితో స్నేహపూర్వకంగా, ఎంతో సహృదయంతో పలకరిస్తూ ఉండేవారు. అటువంటి సోదరుడు ఈ రోజు సభలో లేకపోవడం చాల విచారించదగ్గ విషయం .వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేసుకొంటూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని , అంతేకాకుండా మొన్ననే ఎన్నికల్లో గెలిచి ఇక్కడకు వచ్చిన సోదరి సబితా ఇంద్రారెడ్డిగారు తన భర్త ఆశయాలకు అనుగణంగా వారి ప్రాంత ప్రజల అభీష్టాలను నెరవేరుస్తూ ముందుకు సాగాలని నేను మనసారా వాంఛిస్తూ ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేసుకొంటున్నాను.

శ్రీ కె హరీశ్వర్‌రెడ్డి: అధ్యక్షా, ఈ రోజు ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని నేను మన:స్ఫూర్తిగా బలపరుస్తున్నాను.

ఇంద్రారెడ్డిగారి మరణానికి సంబంధించి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెడతామనే విషయం ఏనాడు కలలో కూడ అనుకోలేదు.

1975 నుండి ఇద్దరమూ గ్రామ సర్పంచ్‌గా, అతను సమితి ప్రెసిడెంట్‌గా ఒకేసారి పోటీ చేశాం . మా ఇద్దరివి పక్క పక్క నియోజకవర్గాలే. ఆనాడు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా అభ్యదయభావాలతో అనేక ఉద్యమాల్లో ఇద్దరమూ పాల్గొన్నాం .అతను సమితి ప్రెసిడెంట్‌గా ఉంటే, నేను వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నాను. నేను 1983లో ఇండిపెండెంట్‌గా ఎం .ఎ.ఎల్‌గా పోటీ చేస్తే, ఇంద్రారెడ్డి లోక్‌దళ్ తరపున పోటీ చేసి ఓడిపోయాడు. అప్పటి నుండి కూడ మేము కుటుంబట సభ్యులుగా ఉండేవాళ్లం . రంగారెడ్డి జిల్లా చాల వెనుకబడిన జిల్లా ఏ విధంగా అయినా సరే ఈ జిల్లాను అభివృద్ధి చేయాలని ఎప్పుడూ అనుకొంటూ ఉండేవాడు .నేను కూడ వారి భావాలతో ఏకీభవించి, అనేక ఉద్యమాల్లో ్ల మేమిద్దరం పాల్గొంటూ ఉండేవాళ్లం .1985 నుండి కంటిన్యూగా అతను నేను మూడుసార్లు తెలుగుదేశం పార్టీ తరపున శాసనసభ్యులుగా ఉంటూ వచ్చాం . మూడు సార్లు మంత్రిగా ఉండి, జిల్లాలోని ప్రతి గ్రామాన్ని తిరగడం జరిగింది. ఈ జిల్లా అభివృద్ధి కొరకు ఎన్నో ప్రయత్నాలు చేయడం జరిగింది. ఎప్పుడు చూసినా అతను చాల సంతోషంగా ఉంటూ, ప్రతి ఒక్కరిని అన్న అంటూ పలకరిస్తూ, తనను కూడ అందరూ ఇంద్రన్న అంటూ సంబోధిస్తూ ఉండేవారు.వారి మరణాన్ని ల్లా ప్రజలు ఇంకా జీర్ణించుకోలేకపోతున్నారు. ఎందుకంటే ఏ పార్టీలో ఉన్నా, ఎక్కడ ఉన్నా, తెలుగుదేశం పార్టీతో విభేదించి, కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ, ఈ జిల్లా అభివృద్ధి కొరకు నిర్వహించే అనేక మీటింగ్‌ల్లో మాతో ఎంతో సహకరించి, జిల్లా అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమించిన వ్యక్తి. అటువంటి వ్యక్తి ఈ రోజు మన మధ్యలో లేడు. ఒక్క చేవేళ్ల నియోజకవర్గానికే పరిమితం కాకుండా,

రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కొరకు, తెలంగాణా ప్రాంత అభివృద్ధి కొరకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కొరకు నిరంతరం మాట్లాడుతూ శ్రమ పడిన వ్యక్తి. అతి చిన్న ప్రాయంలోనే అటు మాధవరెడ్డిగారు, ఇటు ఇంద్రారెడ్డిగారు వెంట వెంటనే చనిపోవడం ఎవరూ తీర్చలేని లోటు . రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కొరకు శ్రమించిన వ్యక్తిగా జిల్లాలో అతను వేసిన ఫౌండేషన్సే నిదర్శనం . వారి మరణం జిల్లా వాసులకు తీరని లోటు అని ఈ సందర్భంగా మనవి చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. ఉప ఎన్నికల్లో గెలిచి ఇక్కడకు వచ్చిన సబితా ఇంద్రారెడ్డిగారికి ఈ సందర్భంగా హామీ ఇస్తున్నాను-- రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కొరకు వారితో సహకరిస్తాను. ఎందుకంటే ఈ జిల్లా అభివృద్ధి కొరకు ఇంద్రారెడ్డి, నేను 20 ఏళ్లపాటు శ్రమపడుతూ, ఒక కుటుంబ సభ్యులుగా ఉన్నాం . ఈ రోజున వారు మన మధ్య లేరు. వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతి తెలియచేస్తూ, భగవంతుడు వారికి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ఇవ్వాలని కోరుతూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ పి .లక్ష్మయ్య: అధ్యక్షా, ఇంద్రార్డెగారి మరణం వారి మిత్రులకు, అభిమానులకు, ఆత్మీయులకు తీరని నష్టం కల్గించింది. దిగ్ర్భాంతి కల్గించింది. ఎందుకంటే అంతకు రెండు రోజుల ముందు మేమందరం కలిసి ఇక్కడ సి. ఎల్.పి .కార్యాలయంలో ప్రెస్ కాన్ఫరెన్స్ ఒకదానిని ఏర్పాటు చేసాం . దాంట్లో మేమంతా పాల్గొన్న రెండు రోజులకే ఆయన మృత దేహం చూడడం చాల దిగ్ర్భాంతి కల్గించింది . ఇంద్రారెడ్డిగారు ముఖ్యంగా మూడు విషయాల మీద ఎక్కువగా శ్రద్ధ వహించేవారు అనే దాంట్లో సందేహం లేదు. ఒకటి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కొరకు తనదైన శైలిలో శ్రమపడేవారు, రెండవది, వెనుకబడిన బలహీన వర్గాల వారి కోసం, మూడవది తెలంగాణా ప్రాంత అభివృద్ధి కొరకు నిరంతరం శ్రమించిన వ్యక్తి అని ఈ సందర్భంగా చెప్పకతప్పదు . ఎందుకంటే ఆయన నియోజకవర్గం వెళ్లి చూస్తే, అనేక కాలనీలకు ఆయన పేరు పెట్టిన విషయం కనపడుతుంది. ఆ విధంగా వారు చేసిన సేవకు ప్రజలు చూపిస్తున్న అభిమానమే నిదర్శనం . అదే విధంగా ఆయన్ని నమ్మిన వాళ్లకు ఎప్పుడూ కొండంత అండగా నిలవడం రాజకీయాల్లో ఆయన కొత్త ఒరవడిని సృష్టించాడని చెప్పకతప్పదు. అట్లాగే అందర్నీ అన్న అంటూ ఆప్యాయతగా పిలుస్తూ, అందరి మనస్సుల్ని దోచినవ్యక్తి అని చెప్పడంలో ఎవరికీ సందేహం ఉండదు.

ఉ.10.30

అదే విధంగా సోదరి సబితా రెడ్డికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన మరణం వల్ల మనం రెండు విషయాల మీద దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుందని నా వంతుగా చెబుతున్నాను. ఈనాడు వాహనాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ వాహనాలు నడిపే వారికి డ్రైవింగు లైసెన్సులు ఇష్యూ చేయడంలో నియమనిబంధనలను కఠినంగా అమలు పరిచేలా నిర్ణయం తీసుకోవాలి. అదే విధంగా ప్రజలు హర్షించే విధంగా స్వచ్ఛమైన రాజకీయాలను ప్రజలకు అందించే విధంగా, ప్రజలు ఆ రాజకీయాలను మెచ్చుకునే విధంగా ఉండాలని కోరుకుంటూ శ్రీ ఇంద్రారెడ్డి గారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ టి . శ్రీనివాస్‌యాదవ్ :- అధ్యక్షా, ఇంద్రారెడ్డి గారి మరణం పట్ల గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. ముఖ్యంగా సమాజంలో మనం ఎంతోమందిని చూస్తూ ఉంటాం . ఎంతోమంది వ్యక్తులు పుట్టడం, మరణించడం జరుగుతూ ఉంటుంది కాని, కొంత మందిని మాత్రమే మనం చిరస్థాయిగా గుర్తుంచుకుంటాం . అటువంటి వ్యక్తులలో ఇంద్రారెడ్డి గారు, మాధవరెడ్డి గారు వంటివారుంటారు. రంగారెడ్డి జిల్లాకే కాక ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ఇంద్రారెడ్డి గారి మరణం తీవ్రమైన లోటు అని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఒక్క హైదరాబాదు జంటనగరాలకే కాకుండా రంగారెడ్డి జిల్లాతో వారికున్న అవినాభావ సంబంధాలు అందరికీ తెలుసు. ఒక వ్యక్తి ఒకసారి కలిసేక, రెండవ సారి తిరిగి కలిస్తే అతనిని పేరు పెట్టి పిలిచేటంత జ్ఞాపకశక్తి ఇంద్రారెడ్డి గారికుండేది. చిన్న తనం నుంచి రాజకీయాలలో ఉంటూ ఎంతో పట్టుదలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి అందరి ఆదరాభిమానాలను పొందారు. వారు మరణించనపుడు ప్రత్యేకించి రంగారెడ్డి జిల్లాలోనే కాక వారి గ్రామానికి వెడితే వేలాదిమంది ప్రజలు ఏడుస్తూ 'ఇంద్రన్న మరణించాడు, అన్యాయం జరిగింది ' అంటూ విలపించారు. వారి మరణం పట్ల ఈ శాసనసభకే కాక ప్రత్యేకించి రంగారెడ్డి జిల్లా , చేవెళ్ల నియోజకవర్గానికి తీరని లోటుగా గుర్తు చేస్తూ వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె . జానారెడ్డి :- అధ్యక్షా, ఇంద్రారెడ్డి గారి ఘోరమైన దుర్మరణం చాలా విచారకరమైనది, బాధాకరమైనది. వ్యక్తిగతంగా నన్ను చాలా బాధకు గురి చేసిన ప్రధానమైన సంఘటన ఈ మధ్యకాలంలో ఇదే ఇంద్రారెడ్డి గారితో నాకున్న సన్నిహిత సంబంధాలు ఈ హౌసులో చాలా మందికి తెలుసు. ఒక్కసారి వాటిని గుర్తు చేసుకుంటే, 1980 వ సంవత్సరం నుంచి చాలా సన్నిహితంగా గురుశిష్యుల్లాగా, సహోదరుల్లాగా, కొలీగ్సులాగా మేము వ్యవహరించిన తీరు నిజంగా అద్వితీయం . 1983 వ సంవత్సరంలో నేను రాష్ట్ర మంత్రిగా ఉన్నపుడు ఆయనను మొట్టమొదటిసారిగా ఎన్.టి.రామారావు గారికి పరిచయం చేసి, తెలుగుదేశం పార్టీలో చేర్పించినవాడిని. అంతేకాదు, నా శాఖలో అగ్రికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబరుగా అపాయింటు చేయడం, పార్టీలో మొదటగా వారిని చేర్పించడం జరిగింది. ఇందుకు నాకు ఎన్నో అడ్డంకులు, ఇబ్బందులు ఎదురైనప్పటికీ కూడా వాటిని అధిగమించి, అతనిని రంగారెడ్డి జిల్లాలో ఒక ప్రధానమైన నాయకుడుగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చేయడానికి ఆనాడు ఎన్.టి .రామారావు గారిని ఒప్పించి, మెప్పించాను. తదుపరి ఆయన ప్రజాభిమానాన్ని సంపాదించి, అనేక నాయకులను తయారు చేయడం, కార్యకర్తలను తయారు చేయడం ద్వారా పార్టీని ముందుకు తీసుకువెళ్లడంలో కృతకృత్యుడు అయినందుకు చాలా సంతోషం కలిగింది. అందుకు ఎంతో గర్వపడ్డాను. ఆ తర్వాత శాసనసభ్యుడుగా, నాతోబాటు క్యాబినెట్ కొలీగ్‌గా ఉన్నారు. ఆ తర్వాత వివిధ కారణాల వల్ల పార్టీ విడిపోయినప్పటికీ, ఏ పార్టీలో ఉన్నప్పటికీ అత్యంత గౌరవంతో, నా సలహా సంప్రదింపుల మేరకు పోతూవుండేవాడు. నాపట్ల అతనికి అంత నమ్మకం, విశ్వాసం . అవి మరపురానివి. ఆ తర్వాత ఆయనకు కలిగిన సంక్షోభం వల్ల పార్టీ

విడిచిపెట్టినా తిరిగి కాంగ్రెసు పార్టీలో చేర్చడానికి నా సలహాసంప్రదింపుల మేరకే, నాతో సమావేశమై, నేను డ్రాఫ్ట్ చేసిన డ్రాఫ్టింగుతోనే కాంగ్రెసు పార్టీలో తిరిగి చేరడానికి నిర్ణయించుకున్నాడు. నాతో అంతటి సన్నిహిత సంబంధం కలిగినవాడు. తెలంగాణా పార్టీ పెట్టినపుడు గాని, తెలంగాణా విషయాలు మాట్లాడినపుడు గాని ప్రతిసారీ నా సలహాలు తీసుకుని ముందుకుపోయేవాడు. అయినప్పటికీ వారితో నాకున్న సంబంధాన్ని ఆయన ఉన్నతి కొరకే ఉపయోగించాను తప్ప మరే ప్రయోజనానికి ఉపయోగించకునేలా సలహాలు ఇవ్వలేదు. ఈ విధంగా ఆత్మీయత పెనవేసుకున్న విషయం చాలామంది మిత్రులకు తెలుసు. కొందరికి తెలియకపోవచ్చు. ఆ విధంగా వారి కుటుంబంతో నాకున్న సంబంధం చాలా గాఢమైనది. ఈ పరిస్థితులలో ఎంతో సన్నిహిత సంబంధం కలిగి, రాజకీయాలలో చేదోడువాదోడుగా ఉన్న ఒక మంచి మిత్రుడిని కోల్పోయినందుకు బాధను వ్యక్తం చేస్తూ, వారి మరణం ఈ ప్రాంతం వారికి తీరని లోటుగా భావిస్తున్నాను. ఇంద్రారెడ్డి గారు అభ్యుదయ భావాలు కలిగి, బలహీన వర్గాల వారి సంక్షేమానికి తపిస్తూ, రాత్రింబగళ్లు శ్రమించిన వ్యక్తి. అంతేకాకుండా, ఇబ్బందులకు ప్రాణాలెదురొడ్డి, పోరాడే శైలి కలిగిన నాయకుడు. ఆయన లేని లోటు రాజకీయాలకు, ఈ ప్రాంతం వారికి తీరని లోటు. వారి కుటుంబానికి ఎంతో బాధాకరమైన విషయం. రాజకీయాలలో కార్యకర్తలు ముందుకు సాగడానికి వారి జీవితాన్ని ఒక స్ఫూర్తిగా కలిగి ఉండాలని కోరుతూ, వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఇంద్రారెడ్డి గారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తున్నాను.

డా. కోడెల శివప్రసాదరావు :- మేడమ్ స్పీకర్, సోదర శాసనసభ్యులు ఇంద్రారెడ్డి గారి ఆకస్మిక మృతి సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. 15 సంవత్సరాల సాన్నిహిత్యం, ఆత్మీయత . శాసనసభ్యుడుగా ప్రతిపక్షంలో పనిచేయడం, సహచర కార్యకర్తలతోనే కాక మంత్రివర్గ సహచరులందరితో పనిచేసే అవకాశం కలిగింది. ఎప్పుడు కనిపించినప్పటికీ ఆత్మీయతతో ఆలింగనం చేసుకుని, గుండెతో మాట్లాడే మనిషి, మంచి మిత్రుడు. వారితో కలిసి చేవెళ్ల, రంగారెడ్డి జిల్లాలో అనేక గ్రామాలలో పర్యటించాను. వారికి అట్టడుగు వర్గాల నుంచి ప్రత్యక్షంగా పరిచయాలు కలిగి, వారి సమస్యలను తన సమస్యలుగా భావించడం నేను గమనించాను. ఒక సమర్థుడైన నాయకుడుగా, మంత్రిగా, కార్మిక శాఖ, విద్యాశాఖ, హోంశాఖలలో వారు పని చేసిన తీరు ఈ రాష్ట్ర ప్రజలు మరచిపోలేరు.

అలాంటి ఇంద్రారెడ్డిగారు లేరు అంటే నమ్మశక్యం కాని విషయం . వారు మరణించే కొద్ది సమయం ముందే ఒక వివాహానికి వెళ్లి విందారగించిన తరువాత బయలుదేరుతూ, దయవుంటే రేపు కలుస్తానని చెప్పి బయలుదేరిన వెంటనే ఈ ప్రమాదం జరగడం చూస్తే భగవంతుడు వారి ఉన్నతిని చూచి ఓర్చుకోలేకపోయాడు అనిపిస్తుంది . ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి అంకితభావంతో పనిచేసే వ్యక్తి ఇంకొకరు లేరు అని భావిస్తున్నాను . వారు లేని లోటు ఈ రాష్ట్రానికే కాదు, కాంగ్రెస్ పార్టీకి, ఈ శాసనసభకు కూడా ఉందని భావిస్తూ , అలాంటి మిత్రుడిని కోల్పోయినందుకు వ్యక్తిగతంగా నాకు

ఎంతో లోటని భావిస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి స్థానాన్ని వారి శ్రీమతి భర్తీచేసి వారి ఆశయాలు పూర్తి చేసేదానికి కృషి చేయాలని కోరుకొంటూ, సెలవు తీసుకొంటున్నాను .

డా . పి . శంకర రావు :- అధ్యక్షా, ఇంద్రారెడ్డిగారి గురించి పేదప్రజలలో, ముఖ్యంగా ఆయన నియోజకవర్గంలో ఇంద్రన్నగా పాప్యులర్ అయిన ఇంద్రారెడ్డిగారు నాకు 1980 నుండి స్నేహితుడు . నేను 1980 లో మొట్టమొదటి సారిగా కౌన్సిల్‌కు పోటీ చేసినప్పుడు అక్కడ వారు సర్పంచిగా వున్న రోజు నుండి వారు తుదిశ్వాస విడిచే వరకు నాతో కలిసి వున్నారు . ఏప్రిల్ 21వ తేదీన నాడు ఆయనకు నాకు సన్నిహితుడయిన ఎం పి .టి .సి మెంబరు నరేందర్ పెండ్లికి వారు రావడం జరిగింది పెండ్లి తరువాత రాత్రి 11 గంటలకు అందరం ఒకే కారులో కలిసి రావలసి ఉన్నది . కానీ అప్పటికే చాలా లేటు అయినందున, అందరం వేరే వేరే ప్రాంతాలకు పోవలసినందున 5,10 నిముషాలు వెనుకముందు బయలుదేరాము. వారు మాకంటే 10 నిముషాలు ముందు బయలుదేరడం జరిగింది . అప్పుడే వారు కారు కొన్న డిస్క్రిప్షన్ చెబుతూ

..

గంటకు 120 కిలోమీటర్లు వెళుతుంది, గంటలో ఇంటికి చేరుకుంటామని రోడ్డు
సరిగా లేకపోయినా బండి చాలా బాగా పోతుందని చెబుతూ వచ్చారు . అఖరు నిముషంలో మాట్లాడిన విషయాలు చెబుతాను . మెడిసిటీ, అపోలో హాస్పిటల్స్‌లో పేదప్రజలు ముఖ్యంగా ఆయన నియోజకవర్గానికి చెందినవారు ఆపరేషన్‌కు డబ్బులు చాలకపోతే ఆపరేషన్ చేయకుండా ఆపివేశారనీ, రెండవది ఎవరో పేషెంట్ చనిపోతే,
డబ్బు తక్కువయితే డెడ్‌బాడీ ఇవ్వడానికి అభ్యంతరం చేశారనే విషయంలో ప్రజలకు, ముఖ్యంగా పేదప్రజలకు ఫైవ్‌స్టార్ హాస్పిటల్‌లో చాలా అన్యాయం జరుగుతోంది కాబట్టి, ఈ విషయాన్ని అసెంబ్లీలో రెయిజ్ చేయాలని , ప్రజల ఆందోళనకు సంబంధించిన విషయం ఆఖరు తరుణంలో మాట్లాడి వెళ్లడం జరిగింది వారు పేద ప్రజలపట్ల, కార్మికుల పట్ల, రైతుల పట్ల, యువకుల పట్ల, మహిళల పట్ల ఎంతో ఆలోచన చేశారు .
వారి సమస్యల పట్ల చాలా స్పందించేవారు అనడానికి ఆదొక నిదర్శనం . సుమారు రాత్రి గం . 11.20 ని.లకు బయలుదేరిన తరువాత 11.40 సమయంలో షాద్‌నగర్ నియోజకవర్గానికి, చేవెళ్ల నియోజకవర్గానికి బార్డరులో వున్న పాల్మాకుల్‌కు చేరుకోవడం జరిగింది అఘ్కడే అంటే ఆయన కానిస్టిట్యుయెన్సీకి సుమారు 1 కిలోమీటరు దూరంలో జరిగిన లారీప్రమాదంలో వారు చనిపోవడం జరిగింది ఇది చాలా విచారకరమయిన విషయం . ముఖ్యంగా మాకు చాలా బాధాకరమయిన విషయం . వారు ముఖ్యంగా తెలంగాణా అభివృద్ధి గురించి ప్రతిసారి మాట్లాడేవారు . వారు తెలంగాణాకు జరుగుతున్న అన్యాయాన్ని రెక్టిఫై చేయాలని పాయింటవుట్ చేసేవారు . ప్రజల సమస్యలను అసెంబ్లీలో బయటపెట్టి

ఎన్నో ఉద్యమాలు నిర్వహించి, పేదప్రజల సంక్షేమం కోసం పనిచేసిన ఇంద్రారెడ్డిగారు మనమధ్య లేకపోవడం చాలా దురదృష్టకరమయిన విషయం . వారి ఆత్మకు శాంతి చేకూరాలనీ, వారి కుటుంబసభ్యులకు మనశ్శాంతి కలగాలని కోరుకొంటూ సెలవు తీసుకొంటున్నాను .

... డా ఎన్. జనార్ధన రెడ్డి :- అధ్యక్షా, ఇంద్రారెడ్డిగారి అకాల మరణం గురించి ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ , సోదరుడు ఇంద్రారెడ్డిగారు స్నేహశీలి, అందరితో మంచిగా ఉండాలనే మంచి మనసుతో, మంత్రిగా వున్నా నిగర్విగా వుండడం ఎప్పుడూ కార్యకర్తలతో వారి ఇల్లు కిటకిటలాడుతూ వుండేది. ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగిన వ్యక్తి ఆయన.. ముఖ్యంగా మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లాలంటే ఆయన కానిస్టిట్యుయెన్సీ మీదగా వెళ్లాలి . ఆయన కార్యక్రమాలు ఎప్పుడన్నా దారిలో
జరుగుతున్నప్పుడు చూస్తే, ఆయన జనంలో కలిసిపోయి కార్యక్రమాలు నిర్వహించడం మాకు గుర్తుంది . దురదృష్ట వశాత్తు ఆయన మాజిల్లాలో ఫంక్షన్‌కు వచ్చి, అక్కడ మాజిల్లా *వరలో పరిధిలో పాల్మాకుల్ పాలమాగు దగ్గర వున్న బ్రిడ్జి దగ్గర రెండు మూడు ఫర్లాంగుల దూరంలో ఈ సంఘటన జరగడం చాలా దురదృష్టకరం . ఆ రోడ్డు* చూసప్పుడు ఇంద్రారెడ్డిగారు గుర్తుకు వస్తారు . వారు టిడిపి లో ఉన్నపుడు కలిసి పనిచేసే అవకాశం మాకు కలిగింది . వారు మంచి పట్టుదల కలిగిన వ్యక్తి . మా జిల్లాలో టిడిపి వైపునుండి అనేక కార్యక్రమాలు చేసి వారు అక్కడకు రావడం, కార్యకర్తలను ఉత్తేజపరచడం జరిగేది వారి మరణం పట్ల నా ప్రగాఢ సానుభూతి సంతాపాలను తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ, సెలవు తీసుకొంటున్నాను

SRI. K.R. SURESH REDDY: Madam Speaker, while fully supporting the Condolence Motion moved by the Hon'ble Chief Minister I would like to say that Sri Indra Reddy was like an elder brother to me. I had the opportunity of seeing, meeting and talking to him for the last ten to eleven years. During these eleven years what I could understand about this man was that he was progressive in thinking and a man with indelible charm, which one would naturally, got attracted towards him. He was a person who could make anyone at any time comfortable. The most outstanding feature of him that I could notice was loyalty. We are at a stage where new definitions are being given to politicians and new directions to politics. But, he was an exception to this. The underlining fact of his greatness was his loyalty and I am sure that any type of politics or any type of rules, which we think to bring, would not deviate from this path of loyalty. Andhra Pradesh has lost a great man. His janma bhoomi has lost a great son. Telangana, which was so dear to him, was more than creation. It was liberation of Telangana. Liberation from long and prolonged and deliberate neglect against which he fought for. He wanted to see the Telangana region on par with other developed regions. He dreamt that Telangana should prosper like any other region. In this august House all those representatives from backward areas should pledge that we should continue the struggle initiated by our friend, Indra Reddy. We have with us , today, Mrs. Sabitha. She needs the support. She needs the strength. More so, I would request the Government that the lot of tasks undertaken by Indra Reddy needs to be completed. She is not only a mother of three children but got responsibility to lookafter her

constituents. In this situation like this, I would appreciate if the Government would also facilitate early development of the region which Indra Reddy represented. Another fact which came up during the condolence motion is that the high-way is becoming dangerous these days. It has become hazardous not only in the mornings but also in the evenings. I request the Government to constitute separate cells in the Home Ministry to see that traffic safety is taken into account. I request the Government to dedicate a project after Indra Reddy. With regard to the power project in Ranga Reddy the Government should think of naming after Indra Reddy. It would be in the fitness of things that if the Government would think as a tribute to dedicate a project in his constituency or in his district.

Thank you.

10 .50

శ్రీ ఎం .వెంకటేశ్వర రావు :- అధ్యక్షా, ఇంద్రారెడ్డిగారి మరణం గురించి ఆ రోజున విన్నప్పుడు ముందు మాకు అసలేమీ అర్థం కాలేదు. వాహన ప్రమాదంలో ఆ దుర్ఘటన జరిగిందని మన మాజీమంత్రిగారు చెప్పినప్పుడు మేము పొందిన బాధ వర్ణనాతీతమైనది. ఎందుకంటే ఒక సహచరుడిగా మేము వారితో 1985 నుంచి కలసి వున్నాము. 1989లో ప్రతిపక్షంలో వున్నపుడు కూడా మా జిల్లాలో ఇన్‌ఛార్జ్‌గా వున్న సందర్భంలో మేము కలిసిమెలిసి తిరిగి ఒకరినొకరు అర్థం చేసుకున్న పరిస్థితి వుంది. ఇప్పుడు ఆ తలంపులు గుర్తుకు వచ్చి మనసంతా ఆవేదనతో నిండిపోతోంది. ఏది ఏమైనా ఒక స్నేహితునిగా, కార్య దక్షునిగా , ఏ సందర్భంలో అయినా తన ఉనికిని చాటుకునే విధంగా మెదిలే ఇంద్రారెడ్డిగారు ఎప్పటికీ చిరస్మరణీయులు. మొదటినుంచి పేద ప్రజల విషయంలో, కార్మికుల విషయంలో , సమాజం గురించి మాట్లాడే వ్యక్తిగా, తెలుగుదేశం పార్టీకి సంబంధించిన సభ్యులకే కాకుండా మిగతా అందరికీ కూడా చిరపరిచితులైన వ్యక్తి, కలిసిమెలిసి కార్యక్రమాలు చేయాలనే తపన వుండే వ్యక్తిగా గుర్తింపు వున్న వ్యక్తి.

ఆయన లేని లోటు రాజకీయానికి, రాజకీయపార్టీకీ తీరని లోటుగా, భావిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలిగించాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, ఈ తీర్మానాన్ని మనసారా బలపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి .గోవర్ధన రెడ్డి :- అధ్యక్షా, ఇంద్రారెడ్డిగారి సంతాప సభలో ఈ విధంగా మాట్లాడవలసి వస్తుందని, ఇంద్రారెడ్డిగారు ఇంత త్వరగా మన మధ్యనుండి వెళ్లిపోతారని నేను ఎన్నడూ అనుకోలేదు. ఎందుకంటే ఆయన నా కంటే సరిగా 25 సంవత్సరాలు చిన్నవాడు. అయినప్పటికీ కలుపుగోలుతనం విషయంలో, చిన్న, పెద్ద, అనే తారతమ్యం లేకుండా అందరినీ ' అన్నా' అని పిలుస్తూ ప్రతి కార్యక్రమంలో కూడా చురుగ్గా పాల్గొనేవారు. ముఖ్యంగా ఎన్.టి.ఆర్.గారి

కాలంనుంచి తెలుగుదేశంలో వుంటూ, తెలంగాణా విషయంలో చాలా ఆందోళన చెందుతూ వుండేవారు. నేను కూడా అదే అభిప్రాయంతో వుండేవాడిని. తెలంగాణా వెనుకబాటుతనాన్ని ఏ విధంగా పారద్రోలాలి, ఏ విధంగా దాని విషయంలో ఆందోళన చేయాలనే విషయాల గురించి మాట్లాడుతూ వుండేవారం . ఏ పార్టీ ప్రభుత్వం వున్నప్పటికీ కూడా తెలంగాణాకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఇంద్రారెడ్డిగారు గుర్తించి అప్పుడు తెలంగాణా జిల్లాలను విస్తృతంగా తిరిగి, తెలంగాణా ప్రజలను, విద్యార్థులను, యువకులను, చైతన్యవంతులను చేయడానికి ప్రయత్నం చేసారు. తరువాత 21వ తేదీన మేము కొంతమందిమి కూర్చుని మాట్లాడాము. వారం, పది రోజులలో అన్ని పార్టీలకు చెందిన శాసన సభ్యులను సమీకరించి తెలంగాణా ప్రాంతాభివృద్ధికి పెద్దఎత్తున కృషి చేద్దామని అనుకున్నాము. కాని దురదృష్టవశాత్తు వారు మన మధ్య లేరు. కాని వారు ఏది చేయాలని ఆశించారో, వారి ఆశయ సాధనకు తెలంగాణా ప్రాంత శాసనసభ్యులందరూ కృషిచేయాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, వారి ఆత్మ కు శాంతిని కలుగజేయాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, ఈ తీర్మానాన్ని బలపరుస్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వడ్డె శోభనాద్రీశ్వర రావు :- మేడమ్ స్పీకర్, అతి పిన్న వయసులో ఇంద్రారెడ్డిగారు ఆకస్మిక మరణానికి గురికావడం అత్యంత దురదృష్టకరమైన విషయం . ఈ శాసన సభకు, తెలంగాణా ప్రాంతానికి, ప్రత్యేకంగా చేవెళ్ల నియోజకవర్గానికి ఇది తీరని లోటు. విద్యార్థి దశ నుంచి చాలా చురుగ్గా రాజకీయాలలో చాలా స్పష్టమైన అవగాహనతో పాల్గొంటూ, ప్రత్యేకించి కార్మికుల, కర్షకుల సమస్యల గురించి కృషి చేసిన వ్యక్తి. ఆ రోజులలో, లోక్‌దళ్ పార్టీలో, చింతల్‌బస్తీలో మా లచ్చన్న గారి ఇంటి దగ్గర ఎన్నో పర్యాయాలు కలుస్తూ వుండేవారు. ఆయనతో పరిచయమైన క్షణం నుంచీ, చిన్నవారినీ, పెద్దవారినీ కూడా ఎంతో ఆప్యాయతతో పలుకరిస్తూ వుంటారు . ఆయన ఆప్యాయత, అనుబంధం మనమీద ఎంతో గాఢమైన ముద్ర వేస్తుంది.

నాకు బాగా గుర్తు వారు విద్యాశాఖామంత్రిగా వుండగా, చాలా పర్యాయాలు 'టీచర్స్ యూనియన్' వారు కలిసినప్పుడు చెప్పేవారు. ''మా సమస్యల గురించి చక్కగా, సావధానంగా విని, వాటి పరిష్కారానికి ముఖ్యమంత్రిగారి దగ్గర కూడా కృషి చేసారని'' వారు సంతృప్తిని వ్యక్తం చేస్తూ వుండేవారు. ఏ పార్టీలో వున్నప్పటికీ పార్టీ పటిష్టతకు, ప్రగతికి, అలాగే తనను ఎన్నుకున్న ప్రజలయొక్క సమస్యల పరిష్కారానికి, ఆ ప్రాంతాభివృద్ధికి నిర్విరామంగా కృషి చేసిన మనిషి.

ఉ.11.00

ప్రత్యేకించి కొన్ని వేల మంది నిరుపేద కార్యకర్తలను పలకరించే విధానం, ఆ కార్యకర్తలలో చెరగని ముద్ర వేస్తుంది. ఎన్నో లక్షల మందిలో నా పేరు గుర్తుంచుకున్నారు అనే బ్రాండ్ ఆ నాయకుడికి, కార్యకర్తకి మధ్యన ఏర్పడేది. ఆ విధంగా ప్రజలను చేరుకుని మంచి ముద్రను వేశారు. ఆయన ఆత్మకు

భగవంతుడు శాంతి చేకూర్చాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తపరుస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ ఎం. నర్సింహులుః అధ్యక్షా, ఇంద్రన్న లేకుండా ఈ సభలో మాట్లాడవలసిరావడం చాలా బాధాకరం. ముఖ్యంగా విద్యార్థి నాయకుడిగా విద్యార్థులను సమీకరించి వారి సమస్యల మీద పోరాటంచేసే వ్యక్తి ఇంద్రారెడ్డి. నాకు వారు 1975లో పరిచయం అయినారు. నాతో కలిసి హాస్టల్‌లో ఉన్నారు. ఇద్దరం ఒకే ప్లేట్‌లో ఎన్నోసార్లు కలిసి తిన్నాము. నేను డిగ్రి కాలేజ్‌లో అధ్యక్షుడిగా, వారు లా కాలేజ్‌లో అధ్యక్షులుగా ఉన్నారు. అంతేకాకుండా రాజకీయాలలో అనుకోకుండా ఇద్దరం ఎం.ఎల్.ఏలుగా, మంత్రులుగా చేసాము. వారితో కలిసి పనిచేసే అదృష్టం నాకు కలిగింది. ముఖ్యంగా ఇంద్రారెడ్డిగారు చనిపోయారనే వార్త వినగానే నాకు గుండె ఆగిపోయినంత పని అయ్యింది.ఏది ఏమయినా రాజకీయాలకు అతీతంగా ఒక వ్యక్తిత్వం కలిగిన నాయకుడిగా అట్టడుగు, బడుగు వర్గాలకు ఎంతో సేవ చేశారు. వారి ఇళ్లలోకి వెళ్లి కంచం తీసుకొని వారితో కలిసిపోయే సాంప్రదాయాన్ని ఇంద్రారెడ్డిగారు అలవరచుకొన్నారు. ఏ హరిజన, గిరిజన, పేద వర్గాల ఇంటికి వెళ్లినా ఇంద్రన్న అనే పరిస్థితి, అంతేకాకుండా మల్లన్న, నర్సన్నాఅని పిలిచే వ్యకి, అటువంటి సాంప్రదాయం కలిగిన వ్యక్తివారు. ఏది ఏమయినా ముఖ్యంగా అట్టడుగువర్గాల నాయకుడు. వారు ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ రాష్ట్రానికి,ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజక వర్గానికి వారు లేకపోవడం అనేది ఎంతో తీరని లోటు. వారి సతీమణి ఎం.ఎల్.ఏగా గెలిచారు. వారికి ముగ్గురు కుమారులు. భగవంతుడు వారిని ఆశీర్వదించాలని, ఇంద్రారెడ్డికి ఒక స్నేహితుడిగా ప్రార్థిస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

శ్రీ బి. సారయ్యః అధ్యక్షా, గౌరవనీయులైన శాసనసభ్యులు ఇంద్రారెడ్డిగారి మరణం ముఖ్యంగా తెలంగాణాకు తీరనిలోటు. ఇంద్రారెడ్డిగారి మరణవార్త టి.విలో చూసిన తరువాత ఎవరూ నమ్మలేని పరిస్థితి ఏర్పడింది. ఒక యువ నాయకుడు ఈ ప్రాంతంలో అందరిని కూడగట్టుకొని ఈ ప్రాంత సమస్యలను శాసనసభద్వారా ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చారు. ఈ ప్రాంతానికి ఏదో చేయాలనే కుతూహలం ఉన్న మహానాయకుడు. ఇంద్రారెడ్డిగారి పరిచయం మాకు తక్కువ. శాసనసభ ఎన్నికల తరువాత వారితో పరిచయం ఏర్పడింది. మమ్ములను కలిసినప్పుడు తనకన్నా మేము చిన్న అయినా అన్నగా అందరితో ఆప్యాయతా, ప్రేమను పంచిన నాయకుడు. ఈ ప్రాంతంలో ఉన్న గిరిజన సమస్యను తీర్చాలన్న ఉద్దేశ్యంతో, నీటి సమస్యను తీర్చడానికి వనరులను సమకూర్చాలన్న ఉద్దేశ్యంతో అందరి సహకారంతో ఉద్యమం చేపట్టాలన్న నాయకుడు. ప్రజావ్యక్తిగా ఉన్న ఈ నాయకుడు లేకపోవడం చాలా దురదృష్టకరం . వారి సతీమణి సబితగారు ఇంద్రారెడ్డిగారి ఆశయాలకు అనుగుణంగా ఉండాలనీ, ఉంటారనీ ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఇంద్రారెడ్డిగారి

ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని బలపరస్తూ, ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఇ. పెద్దిరెడ్డిః అధ్యక్షా, ఇంద్రారెడ్డిగారు ఈ సభలో ఈనాడు లేకపోవడం వారి హఠాన్ మరణం గుంచి ఈనాడు సంతాప తీర్మానం ప్రవేశపెట్టడంఅనే పరిస్థితి వస్తుందని వారి మిత్రుడిగా నేను ఎన్నడూ ఊహించలేదు. వారు తాము నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఈ రాష్ట్రానికి, సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలని తమదైన శైలిలో అందరిని కలుపుకొని నూతన అధ్యాయాన్ని సృష్టించాలని ప్రయత్నం చేసిన గొప్ప ధైర్యశాలి. వారు కార్మికమంత్రిగా రాష్ట్ర ప్రభుత్వంలో బాధ్యతలు నిర్వర్తించినప్పుడు , నేను కార్మిక విభాగానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండే అవకాశం రావడం వారితో ఎన్నో పగళ్లు, రాత్రులు కలిసి పనిగేయడం జరిగింది. ఈ బూజు పట్టిన చట్టాలను సమగ్రంగా మార్చాలని వారు ఎంతో ప్రయత్నం చేశారు. ఇండస్ట్రియల్ డిస్‌ప్యూట్ యాక్ట్ సెక్షన్ 2 (ఏ) అమెండ్‌మెంట్, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో కొన్ని అంశాలను సవరించి, హమాలీ,ముఠా జట్టుకి సంబంధించి ఈ పేద , అసంఘటిత కార్మికులను షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో వారిని పొందుపరచే అంశాలకు సంబంధించి రాష్ట్ర శాసనసభలో తీర్మానించి రాష్ట్రపతి ఆమోదం పొందింపచేశారు.ఈనాడు భారతదేశానికి ఒక తలమానికంగా చట్టంలో సవరణలు చేయించి నూతన అధ్యాయాన్ని ప్రవేశపెట్టిన మహానాయకుడు ఆయన. ఎన్నో ఆటుపోట్లు వచ్చినా, ఇబ్బందులు వచ్చినా ధైర్యంగా ఎదొర్కొన్న మహాస్ఫూర్తి గల మనిషి. రంగారెడ్డి జిల్లాలో ఎన్నికలు జరిగినప్పుడు వారి మేనల్లుడయిన రాజేందర్‌రెడ్డి దారుణంగా హత్య గావించబడినప్పుడు అక్కడున్న ప్రజలు భయాందోళనలకు గురికాకుండా చేయాలని వెంటనే నన్ను పిలిపించి వారికి కాలు నొప్పి ఉన్నా కూడా అక్కడికి వెళ్లాలని ఆ బాధ్యత తీసుకొని కష్టపడి కార్యకర్తలను పిలిపించి పనిచెప్పి తాను అనుకొన్నదానిని చక్కగా నిర్వర్తించిన వ్యక్తి. ఇది వారు చేసిన సాహసాలకు ప్రతీకగా గుర్తుచేస్తున్నాను. ఈనాడు యువతకు ఒక స్ఫూర్తి , మార్గదర్శకులు, గొప్ప పేరు ప్రఖ్యాతలు సంపాదించి ఈ రాష్ట్రంలో ఉన్న పేదవారిని, బలహీనవర్గాలవారిని , అందరిని అభివృద్ధి చేసే బాటలో నడిచిన వ్యక్తి ఆయన. భగవంతుడు మంచివారిని గొప్పవారిని ఎక్కువ రోజులు ఉంచడేమో. మరో బాలచంద్రుడిగా, మరో అభిమన్యుడిగా,మరో భగత్‌సింగ్‌గా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న ఇంద్రారెడ్డిగారు ఈనాడు శారీరకంగా మన మధ్యన లేకపోయినా వారు అందరి హృదయాలలో ప్రజల మనిషిగా స్థిరంగా నిలిచారు.

వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ , భగవంతుడు వారి కుటుంబాన్ని ఆశీర్వదించాలని కోరుతూ, ముఖ్యమంత్రిగారు ఈనాడు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, ధన్యవాదాలు తెలియపరుస్తూ సెలవుతీసుకుంటున్నాను.

ఉ.11.10

శ్రీ కె. సత్యనారాయణ గౌడ్ :- అధ్యక్షా, కీ.శే. శ్రీ ఇంద్రారెడ్డిగారు అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి. ఎంతో పోరాట పటిమ కలిగిన వ్యక్తిగా మనందరకు తెలుసు. ముఖ్యంగా తెలంగాణా ప్రాంతం వెనుకబడిన విషయంలోనూ, పెండింగ్ ప్రాజక్టుల సాధన లక్ష్యం కోసం బస్సులో మొత్తం మా తెలంగాణా శాసనసభ్యులందరినీ కలుపుకొని తెలంగాణా పర్యటించాలని అన్నారు. దురదృష్టవశాత్తు ఆయన అకాల మరణం చెందారు. రాష్ట్రంలోని పేద ప్రజల పట్ల, అసంఘటిత వ్యవసాయ కార్మికుల గురించి నిరంతరం శ్రమించేవారు. పేదరిక నిర్మూలనకు ముఖ్యంగా తెలంగాణా ప్రజల కోసం పోరాటం చేయాలని ప్రణాళికను సిద్ధం చేసుకొని, గత శాసనసభ ఎన్నికలైన పిదప మా అందరితో కలిసి మాట్లాడడం జరిగింది. దురదృష్ట వశాత్తు భగవంతుడు ఇటువంటి మంచి వ్యక్తిని తొందరగా తీసుకువెళ్లిపోయారు. గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, ఇంద్రారెడ్డి గారి కుటుంబ సభ్యులకు నా సంతాపాన్ని తెలియజేస్తున్నాను. భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుతున్నాను.

డా. కె. లక్ష్మణ్ :- అధ్యక్షా, కీ.శే. ఇంద్రారెడ్డి గారి మృతిపట్ల గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. ఇంద్రారెడ్డి గారు నాకు 1978 నుండి నాకు బాగా తెలుసు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో మేము కలిసి చదువుకొన్నాము. విద్యారంగంలో మేము విభిన్న సంస్థలకు ప్రాధాన్యం వహిస్తున్నప్పటికీ సైద్ధాంతిక పరంగా భేదాభిప్రాయాలు ఉన్నా మంచి స్నేహితులలగా మేము కలిసి ఉండే పరిస్థితి ఉస్మానియా యూనివర్శిటీ వాతావరణం లో మేము కొనసాగడం జరిగింది. వారు నా కాంటెంపరరీగా ఎం.ఎ., ఎల్ఎల్.బి. పూర్తి చేయడం, విద్యార్థి దశ లోనే 'కౌకుంట్ల' నుంచి సర్పంచ్‌గా ఎన్నిక కావడం, 1983వ సంవత్సరం నుండి రాజకీయ జీవితం ప్రారంభించి 'చేవెళ్ల' నియోజకవర్గం నుండి పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయినా, తరువాత చేవెళ్ల నియోజకవర్గం నుంచి విజయం సాధించడం జరిగింది. కార్మిక మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా, హోం శాఖ మంత్రిగా అయన పదవులను సమర్థవంతముగా నిర్వహించారు. విద్యార్థుల సమస్యలపై నేను వెళ్లి కలిసినప్పుడు ఆప్యాయతతో పలకరించేవారు. మంత్రిగానే కాకుండా అందరితో ఆయన సత్‌సంబంధాలు పెంపొందించుకొని ప్రజల ఆదరణ పొంది ప్రజల మనిషిగా వారు రాణించడం జరిగింది. ఎంతో అత్యున్నత ఆశయాలతో సమాజంలో ఉన్న బడుగు వర్గాల గురించి, దళితుల గురించి ఎనలేని కృషి చేయడం జరిగింది. వివిధ రాజకీయ పార్టీలలో ఉన్నప్పుడు కలసి ఉద్యమాలు, ఆందోళనలు చేసినప్పుడు కూడా మేము కలిసి పనిచేశాము. వారితో నాకు సాన్నిహిత్యం ఉంది. వారు లేని లోటు నేడు స్పష్టముగా కనిపిస్తోంది. భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ఇవ్వాలని కోరుతూ నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

శ్రీ జె.సి. దివాకరరెడ్డి :- అధ్యక్షా, ఈ రోజు గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని మేము బలపరుస్తున్నాము. ఇటువంటి సమావేశంలో ఇంత తొందరగా పాల్గొనాల్సి వస్తుందని ఎవరూ ఊహించలేదు. కీ.శే. ఇంద్రారెడ్డి గారు ఎంతో ఆప్యాయముగా ప్రతి ఒక్కరిని

ముస్లిం పద్ధతిలో ఆలింగనం చేసుకొని పలకరించేవారు. తాను నమ్మిన నాయకుని ఆశాయాలకనుగుణంగా చివరివరకు పనిచేసిన వ్యక్తి ఆయన అని తెలియజేస్తున్నాను. ఎవరైనా స్వల్ప పరిచయం ఉన్న మిత్రులు ఏదైనా పని చేయమని ఆయననడిగితే ఆయన స్పందించి ఒకటి, రెండు రోజులలో ఆ పనిని చేసి సంబంధిత మిత్రులకు తెలియజేసే సంస్కారమున్న ఒక మంచి వ్యక్తిని మేము పోగొట్టుకొన్నామని తెలియజేస్తున్నాను. ఆయన చాలా అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి. కొన్ని తీవ్రవాద సంస్థలతో సంభంధాలు పెట్టుకొని, అన్ని రకాల వారితో సంబంధాలు పెట్టుకొని, ఈ దేశానికి కాంగ్రేస్ పార్టీనే శరణ్యమని తెలుసుకొని మా పార్టీలో చేరి మాలో ఒక సభ్యునిగా ఉన్న మంచి మిత్రుని మేము నేడు కోల్పోయినందుకు బాధపడుతున్నాము. ఆయన ఆత్మకు శాంతి లభించాలని సర్వేశ్వరుడ్ని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా సంతాపాన్ని తెలియజేస్తున్నాను.

శ్రీమతి టి.సునీతారెడ్డి :- అధ్యక్షా, కీ.శే. ఇంద్రారెడ్డి గారి ఆకస్మిక మృతి రాష్ట్రానికీ, ముఖ్యంగా చేవెళ్ల నియోజక వర్గం ప్రజలకు తీరని లోటని తెలియజేస్తున్నాను. ఆయన ఒక సభ్యునిగా, మంత్రిగా ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధితోబాటు, వెనుకబడిన తెలంగాణా ప్రాంత అభివృద్ధి కోసం **' జై తెలంగాణా '** అంటూ అభివృద్ధికి పాటు పడ్డారు. నాకు ఆయనతో ఎక్కువగా పరిచయం లేనప్పటికీ ఇక్కడ తాను నన్ను సోదరిలాగా, చెల్లెమ్మా అంటూ మాట్లాడిస్తూ, అనేక సలహాలను ఇచ్చేవారు. ఏదైనా సమస్యపై మాట్లడుతూ ఉంటే ఆ సమస్యపై చాలా లోతుగా వెళ్లి మాట్లాడేవారు. అటువంటి వారు నేడు మనమధ్య లేకపోవడం చాలా దురదృష్టకరమైన విషయం. వారి ఆశయాలను సబితా ఇంద్రారెడ్డి గారు నెరవేర్చాలనీ, ఆమెకు మనోధైర్యాన్ని భగవంతుడు ఇవ్వాలనీ కోరుకుంటున్నాను. వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్ :- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను. కీ.శే. ఇంద్రారెడ్డి గారు ఒక పోరాట పటిమ కలిగిన నాయకుడు. మొక్కవోని ధైర్యము, పట్టుదల కలిగిన నాయకుడు. అటువంటి ఆయన నేడు మన మధ్య లేకపోవడం అన్నది చాలా దురదృష్టకరమైన విషయం. ఆయన రాష్ట్ర కాంగ్రేస్ శాసనసభా పార్టీ కార్యదర్శిగా మాతో ఎంతో కలసిమెలసి ఉండి ఎప్పుడు సహ కరించిన వ్యక్తి అలాంటి వ్యక్తిని భగవంతుడు ఇంత త్వరగా తీసుకుపోతాడని ఎవ్వరూ అనుకోలేదు. వారు తెలంగాణా ప్రాంతం వెనుక బడి ఉందని ,తెలంగాణా ప్రాంత శాసన సభ్యులు గట్టిగా పోరాటం చేసి తెలంగాణాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయుటకు గాను ప్రభుత్వంతో గట్టిగా పోరాటం చేయాలని చెపుతుండేవారు. ఆయన ఈ రోజు మన మధ్య లేకపోవడం తీరని లోటని తెలియజేస్తున్నాను. వారి మరణ వార్త తెలిసన వెంటనే నేను దిగ్భ్రాంతికి గురికావడం జరిగింది. ఆయన మంచితనానికి మారు పేరుగాబట్టే ఆయన సతీమణిని మంచి మెజారిటీతో గెలిపించడం జరిగిందని తెలియజేస్తున్నాను.

ఆయన ఆత్మకు శాంతి లభించాలని కోరుకొంటూ కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియజేస్తున్నాను.

డా. జి. చిన్నారెడ్డి :- అధ్యక్షా, చిరకాల మిత్రుడు, విసుగు, విరామం లేని ప్రజా నాయకుడు అయిన శ్రీ ఇంద్రారెడ్డి గారి అకాల మరణం పట్ల గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను.

11.20

ఇంద్రారెడ్డిగారితో నా పరిచయం దాదాపుగా 24 సంవత్సరాలు. సమకాలీన విద్యార్థి నాయకుడిగా 1977లో నేను వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘ అధ్యక్షునిగా పోటీచేశాను. అప్పుడు ఇంద్రారెడ్డిగారు విద్యార్థి పొలిటీషియన్‌గా ఆరోజు నా ఎన్నిక కొరకు చాలా కృషిచేశారు. ఒక సంవత్సరం తరువాత లా కళాశాలలో విద్యార్థి నాయకుడిగా ఆయన పోటీ చేసినప్పుడు మేము ఆయనను సపోర్టుచేశాము.

విద్యార్థిదశ తరువాత వారు వారి సిద్ధాంతపరంగా సోషలిస్టు పార్టీలో, లోక్‌దళ్‌లో చేరారు. తరువాత వారు కౌకుంట్ల సర్పంచ్‌గా అయ్యారు. 1980లో అంజయ్యగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంచాయత్‌రాజ్ ఎన్నికలు జరిపినప్పుడు , ఇంద్రారెడ్డిగారు పంచాయతి సమితి అభ్యర్థిగా ఎన్నిక అయ్యారు. 1983లో లోకదళ్ అభ్యర్థిగా అతి తక్కువ మెజారిటీతో ఓడిపోయారు. ఆ తరువాత ఆయన 1985లో టి.డి.పిలో చేరారు. అప్పటి నుంచి వరుసగా ఆయన గెలువడం జరిగింది. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత , అతి చిన్న వయసులోనే ఈయన కార్మిక శాఖా మంత్రిగా, విద్యాశాఖా మంత్రిగా, హోం శాఖా మంత్రిగా అనేక ఉన్నత పదవులను నిర్వహించారు. పదవీ నిర్వహణలో ఆయన తనకుతాను ఒక ప్రత్యేక స్థానాన్ని - రంగారెడ్డి జిల్లాలోనూ, చేవెళ్ల నియోజక వర్గంలోనూ పొందడమే కాకుండా మొత్తం తెలంగాణా ప్రజల హృదయాలలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు.

ఇంద్రారెడ్డిగారు చాలా బీద రైతు కుంటుంబం నుంచి వచ్చారు. ఆయన బడుగువర్గాల ప్రజల పట్ల, రైతు సమస్యలపట్ల మంచి అవగాహన కలిగినవారు. ఆయన మైనారటీ ప్రజల అభివృద్ధిపట్ల , బడుగువర్గాల అభివృద్ధి పట్ల అహర్నిశలూ కృషి చేశారు. మొన్న జరిగిన ఎన్నికలలో ఆయన కాంగ్రెసు పార్టీలో చేరి, కాంగ్రెసు పార్టీ టికెట్టుపై ఎం.ఎల్.ఏ . గా ఎన్నికయ్యారు. ఆయన అప్పుడు కాంగ్రెసు పార్టీ శాసనసభా పక్ష సెక్రటరీగా ఉన్నారు. ఆయన అందరితో కలుపుగోలుగా వుండేవారు. వారి మరణం కాంగ్రెసు పార్టీకి తీరని లోటని మనవి చేస్తున్నాను. అదేవిధంగా వారి అకాల మరణం తరువాత అతి తక్కువ సమయంలో ఎన్నికలు వచ్చినప్పుడు వారి సతీమణి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డిగారిని కాంగ్రెసుపార్టీ ఎంపిక చేసింది. ఆ పార్టీ తరపున నేను ఆ నియోజక వర్గంలో ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా నియమించబడ్డాను. ఆ ఎన్నికల ప్రచారంలో నేను ఎంతో కృషి చేశాను. ఎన్నికల

సందర్భంగా నేను ప్రచారానికి బయలుదేరినప్పుడు , వారి పట్ల ప్రజలలో వున్న ఆప్యాయతానురాగాలు నాకు కళ్లనీళ్లు తెప్పించాయి. అదే సందర్భంలో గ్రామీణ ప్రాంతాలలో కార్యకర్తలు ఇంద్రారెడ్డిగారిపై పాటలు కట్టి పాడడం జరిగింది. ఆ గానం వింటే కళ్లనీళ్లు రాకతప్పదు. చేవెళ్ల ప్రజల ఆశయాలు తీర్చడం కొరకే ఆ నియోజక వర్గం నుండి తిరిగి శ్రీమతి సబితగారు ఎన్నిక చేయబడ్డారు. ఇంద్రారెడ్డిగారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆభగవంతుణ్ణి నేను ప్రార్థిస్తున్నాను. అలాగే వారి కుటుంబానికి , కుటుంబ సభ్యులకు నేను నా ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి కె.పుష్పలీలః– అధ్యక్షా, గౌరవనీయ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఇంద్రారెడ్డిగారి సంతాప తీర్మానాన్ని నేను బలపరుస్తున్నాను. గత అసెంబ్లీ సమావేశాలలో ఇంద్రారెడ్డిగారు కనపడిన ఈసభలో నేడు వారు లేక పోవడం, ఎంతో బాధను కలిగిస్తున్నది. ఆయన చెల్లమ్మా అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు. మా రంగారెడ్డి జిల్లా ఆడపడచువు నీవు, నీకు మా సహాయ సహకారాలు ఎప్పటికీ వుంటాయని చెప్పేవారాయన. కొత్తగా రాజకీయాలలోకి వచ్చిన నేను రాజకీయాలలో రాణించాలని కోరుతూ, ఆయన తన సహాయ సహకారాలను ఇస్తానని చెప్పి అభయమిచ్చారు. ఆయన ఎంతో సోదరభావంతో వుండేవారు. వారి ప్రేమానురాగాలు, ప్రజలను ఆకట్టుకునే తీరు మా అందరికీ స్ఫూర్తిదాయకం . ఈనాడు ఈ సభలో ఆయన లేకపోవడం చాలా విచారకరం . మంత్రిగా, మహిళగా సబితా ఇంద్రారెడ్డిగారికి నా అండదండలు ఎప్పటికీ వుంటాయని తెలుపుతున్నాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ఆయురారోగ్యాలను , ధైర్యాన్ని కలుగ చేయాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి.శ్రీనివాస్ః– అధ్యక్షా, ఈ సభలో ఇంద్రారెడ్డిగారు వున్నప్పుడు వారితో నేను మాట్లాడుతూ వుండేవాడిని. సభలో వారి పార్టిసిపేషన్ ఎంతో యాక్టివ్‌గా వుండేది. శాసన సభ్యుడిగా, ప్రతిపక్ష శాసన సభ్యుడిగా , మంత్రిగా కూడా ఆయన ఎంతో చురుకుగా పాల్గొనేవారు. ఈ సభలో వారికి సంతాపం తెలుపవలసి రావడం చాలా దురదృష్టకరం . 16, 17 సంవత్సరాల పరిచయం, సాన్నిహిత్యం వారితో నాకు వుంది. విద్యార్థి దశ నుండి కూడా వారు నాతో చాలా చ నువుగా వుండేవారు. ఆయనలోని గొప్పతనం ఏమంటే, ఆయన తాను ఒక గొప్పనాయకుడి నని ఎప్పుడూ అనుకునేవారు కాదు. ఒక కార్యకర్తగానే చెలామణి అయ్యేవిధంగా వుండేవారాయన. ఎం .ఎల్. ఏ. అయినా, మంత్రి అయినా, ఎంత గొప్ప హోదాలో వున్నప్పటికీ ఆయన ప్రవర్తనా, వ్యవహార శైలీ ఒకే తీరుగా వుండేవి. ప్రజలతోనూ అలాగే మసలుకునేవారు. ఆవిధంగా ఆయన ప్రజాభిమానాన్ని సంపాదించారు. ప్రజాహృదయాలలో చోటు సాధించుకున్నారు. ఆయనలో వున్న మరో క్వాలిటీ ఏమంటే , దేనినైనా సాధించాలన్నప్పుడు , ఆ కర్తవ్య నిర్వహణ, లక్ష్య సాధన పట్ల ఎంతో కృషి సలిపేవారు. ఆయన కాంగ్రెసు పార్టీలో చేరినప్పుడు, మా నాయకురాలు సోనియా గాంధీ గారి మీటింగు రాజమండ్రిలో జరిగింది. రాజశేఖర రెడ్డిగారు నన్ను ఇన్‌ఛార్జ్‌గా, సీనియరు నాయకునిగా

అక్కడికి పంపారు.  అప్పుడు ఇంద్రారెడ్డిగారు మాట్లాడుతూ మాకు 4, 5 గంటలు పని సరిపోదు. కనీసం 20 గంటలు నన్ను మీరు ఉపయోగించుకోండని, అలా అయితేనే తాను పని చేయగలనని చెప్పారు.

ఉ.11.30

చిన్నచిన్న పనులు నావల్ల కాదని గ్రామ,గ్రామం తిరుగుతూ అహర్నిశలు కృషిచేశారు. మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చాలా సార్లు మా చాంబర్‌కు వచ్చాడు. నేను ఆప్యాయతతో ఎప్పుడు ఆయనను ఇంద్రన్నా అని పిలిచేవాడిని. నీవు క్యాబినెట్ మంత్రిగా పనిచేశావు నీకు ఏదన్నా పని ఉంటే ఫోనుచేసి చెప్పు నీవు నా దగ్గర రావలసినంత అవసరంలేదు అని చెప్పేవాడిని . పని కొరకు రాలేదు సెక్రటేరియట్‌లో పని ఉండి వచ్చి నిన్ను కలసి పోదామని వచ్చాను అనేవాడు. మనిషి లోపల ఏమాత్రం గర్వం అనేది కాని, లేకపోతే గొప్ప హోదాలో ఉన్నాను నేను క్రింది స్థాయికి దిగజారాలన్న భావన అన్నది ఏ రోజు కూడా ఉన్న వ్యక్తి కాదు . ఇటువంటి క్వాలటీస్ ఉన్న వ్యక్తులు చాలా అరుదు. అన్నిటితోపాటు తాను రిప్రజంటు చేస్తున్న నియోజక వర్గం కాకుండా తెలంగాణా ప్రాంతంయొక్క అభివృద్ధి కొరకు, తెలంగాణా ప్రాంతం అభివృద్ధికి నోచుకోకపోవడంలో కాన్స్పిరసీ ఉంది, ఈ ప్రాంతానికి అన్యాయం జరుగుతావుంది, కేవలం చేయలేక కాదుకాని, ఈ ప్రాంతానికి చేయకూడదన్న భావనతో ప్రభుత్వాలు అన్నీ చిన్న చూపు అన్న ఒక పటిష్టమైన భావన ఆ వ్యక్తిలో ఉండేది. ఆ భావనతో నేను ఏకీభవిస్తున్నాను. తెలంగాణా ప్రాంతం అభివృద్ది కొరకు ఏ త్యాగానికైనా సిద్ధమైన వ్యక్తి. నమ్ముకొన్న సిద్ధాంతాలలో పూర్తి విశ్వాసం ఉన్న వ్యక్తి. ఆయన చదువుకొనే రోజుల నుంచి కాంగ్రెస్ పార్టీకి చాలా దూరంగా ఉన్నారు. తెలంగాణా పార్టీ ఒకటి స్థాపించాలన్న ప్రయత్నం చేసిన తరువాత కేవలం సిద్ధాంత పరంగా ఆయన లక్ష్యసాధన కొరకు కాంగ్రెస్ పార్టీ తప్ప రాజకీయంగా వేరే మార్గం లేదన్న భావనతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అతి త్వరలోనే అందిరిలో ఒకడుగా మారి ఒక సీనియర్ నాయకుడిగా ఎదిగారు. మళ్లీ శాసన సభకు ఎన్నికై శాసన సభాపక్ష కార్యదర్శియై ఈ పార్టీలో ఉన్నతస్థాయిని సంపాదించుకొని తెలంగాణా ప్రాంతంయొక్క అభివృద్ది కొరకు అభ్యున్నతి కొరకు అహర్నిశలు కృషి చేశారు . ఆయన కార్లు అన్నిటిపై జై తెలంగాణా అని రాసివుంటాయి. నేను వారియొక్క సహోదరుడి మృతిపట్ల సంతాపం తెలియచేయడానికి ఈయన చనిపోవడానికి ఒక వారం రోజుల ముందు కలసిరావడం జరిగింది. వారం రోజుల లోపల ఇంద్రారెడ్డిగారు లేకుండా పోవడం చాలా దురదృష్టకరం . ఇన్ని గొప్ప క్వాలిటీస్ ఉండి మంచి సంకల్పంతో ముందుకు వెళుతూ ఎంతో ఎదుగుతున్న ఒక వ్యక్తిని భగవంతుడు అకాలంగా తీసుకుపోవడం చాలా దురదృష్టకరం అని మనవిచేస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ వారి ఆత్మకు శాంతి కల్గించడమే కాకుండా భగవంతుడు సబితా ఇంద్రారెడ్డిగారికి మనోస్థైర్యాన్ని ,ధైర్యాన్ని ఇచ్చి వారు వదిలి వేసిన పనులను పూర్తి చేయాలని, చేవెళ్ల వాసులకే కాకుండా తెలంగాణా ప్రజల న్యాయం కొరకు పోరాటంలో ముందుండాలని కోరుతూ, మా అందరి మద్దతు వారికి ఉంటుందని తెలియచేస్తున్నాను .నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ జి. జైపాల్‌యాదవ్‌:-అధ్యక్షా, జాతస్య మరణం ధ్రువం, పుట్టిన ప్రతిజీవి కూడా ఎప్పుడో ఒకసారి గిట్టకతప్పదు. ఇంద్రారెడ్డిగారు మా మహబూబ్‌నగర్ జిల్లాకు అత్యంత ఆప్తుడు, మిత్రుడు. వారు 1972లో పరిచయం కావడం జరిగింది . మొట్టమొదటిసారిగా సోషలిష్టు భావలతోటి రామమనోహర లోహియా సిద్దాంతాలతోటి వారి విధానాలకు అనుగుణంగా అప్పుడు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్దులకు మద్దతు తెలిపాము. శ్రీ బి.సత్యనారాయణరెడ్డిగారు, శ్రీ బద్రివిశాల్‌పిట్టిగారు ఇంద్రారెడ్డిగారు మేము అంతా కలసి పనిచేయడం జరిగింది.1975 సంవత్సరంలో అప్పటి ప్రధానమంత్రి కీర్తిశేషులు శ్రీమతి ఇందిరాగాంధీగారు ఎమర్జన్సీ విధించినప్పుడు మేము ఎమర్జన్సీకి వ్యతిరేకంగా కూడా పనిచేయడం జరిగింది. 1981లోఅప్పటి ముఖ్యమంత్రి శ్రీఅంజయ్యగారు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపినప్పుడు వారు,నేను సర్పంచిగా పోటీచేసి ఎంపిక కావడం జరిగింది.రాజకీయంగా అవినాభావ సంబంధాలు ఏర్పరుచుకొని 1983లో లోక్‌దళ అభ్యర్ధిగా పోటీచేసి అతి తక్కువ ఓట్లతో ఓడిపోయిన తరువాత 1985లో తెలుగుదేశం పార్టీలోకి రావడం జరిగింది. వారు ఇప్పటివరకు వరుసగా శాసనసభకు ఎన్నికై కార్మిక,విద్యా, హోం శాఖా మాత్యులుగా రాష్ట్రానికి సేవ చేయడం జరిగింది. వారు చేసేటటువంటి సేవలు ఎప్పటికి మర్చిపోలేనటువంటివి. వారు లేకుండా ఈరోజు మనం సభ జరుపుకొంటున్నాము. చిన్న వయస్సులోనే వారిని మృత్యువు కబళించింది .అకాల మృత్యువుపాలైనాడు . వారు లేని లోటును తీర్చలేము.వారి సతీమణి ఆయన స్థానంలో చేవెళ్ల ప్రాంత ప్రజల ప్రేమాభిమానాలు చూరగొని శాసనసభకు ఎన్నిక కావడం జరిగింది. ఇంద్రారెడ్డిగారు ప్రవేశపెట్టిన పనులను పూర్తి చేయడానికి ఆప్రాంత ప్రజల అభివృద్ధి కొరకు తప్పకుండా ఆమె పనిచేయాలని కోరుతున్నాను . వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢమైన సానుభూతిని తెలియచేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకొంటూ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ ఆర్.పాపారావు:అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ కీర్తిశేషులు గత 15 సంవత్సరాల నుంచి ఎంతో అనుబంధంగా అన్నదమ్ములులాగా మెలిగిన వాళ్లం . శాసనసభకు రాగానే మనసారా ఆలింగనం చేసుకొని పాపన్నా, ఇన్ని సంవత్సరాలకు మనం శాసనసభలో కలుసుకోవడం, కలిసి పనిచేసే అవకాశం రావడం జరిగింది, మనం తెలంగాణా గురించి పోరాటం సల్పవలసిన అవసరం ఉందనిచెప్పి ఎన్నోమార్లు కోరడం జరిగింది . ఇప్పటికి నా మనస్సులో బాధాకరమైన సంఘటనలు మెదులుతున్నాయి.

ఉ.11.40

వారి అకాలమరణం వార్త విని ఆ రోజు పూర్తిగా చలించిపోయాను. వెంటనే ఇక్కడ గాంధీభవన్‌కు వచ్చి అందరం కలసివెళ్లి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేశాం .

ఇంద్రారెడ్డిగారి గురించి శాసనసభలో ఈరోజు ఈవిధంగా మాట్లాడవలసివస్తుందన్నది ఊహించని విషయం.

ముఖ్యంగా తెలంగాణాకు నిధులు కేటాయించే విషయంలోగాని, గోదావరి వాటర్స్ విషయంలోగాని, ఇతరత్రా జరిగే అన్యాయాల విషయాల్లోగాని ముందుండి ఖండించేవారు. శాసనసభ్యులమందరం కలిసి రెండు బస్సుల్లో అన్ని జిల్లాలు తిరిగి తెలంగాణాకు జరిగే అన్యాయం గురించి ప్రజలకు చెప్పాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎన్నోమార్లు వారు నాకు చెప్పటం జరిగింది. క్రొత్తగా శాసనసభ్యులుగా ఎన్నికై మేము హౌస్‌లోకి వచ్చినప్పుడు సి.ఎల్.పి. కార్యదర్శి గా వారు ఎంతో చొరవ తీసుకొని ఏ సబ్జక్ట్‌పై ఎవరెవరు మాట్లాడదలచుకున్నారో వారందరి దగ్గరకూ వచ్చి చర్చించటంలోగాని, క్వశ్చన్స్ ప్రిపేర్ చేయటంలోగాని, అందరికీ సహకరించటంలోగాని చూపిన చొరవ మరువలేనిది. చాలామంది సభ్యులు మాట్లాడుతూ వారి గుణగణాలగురించి చెప్పారు. ఇంద్రారెడ్డిగారంటే చొరవకు, ఆప్యాయతకు మారుపేరని గుర్తుచేస్తుంటే వారిని కోల్పోయినందుకు నిజంగా చాలా బాధగా ఉంది. ఎంతో భవిష్యత్తుగల నాయకుడు, చిన్నతనంలోనే మంత్రిపదవిని అలంకరించారు, ఎంతో సమర్థవంతంగా తనకు అప్పగించిన శాఖలు నిర్వహించారు, ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అందుకునే దశలో అకాలమరణం పొందటం ఎంతో బాధాకరమైన విషయం. భగవంతుడు వారి కుటుంబానికి ధైర్యాన్నివ్వాలని, వారి సతీమణి సబితా ఇంద్రారెడ్డిగారు ఆ నియోజకవర్గంలో వారు లేనిలోటు తీర్చాలని కోరుకుంటూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీమతి కె. సురేఖ: అధ్యక్షా, సోదరులు ఇంద్రారెడ్డిగారి మృతికి సంతాపాన్ని తెలుపుతూ గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. వారి మృతి చేవెళ్ల నియోజకవర్గంకే కాకుండా, తెలంగాణా ప్రజానీకానికే కాకుండా కాంగ్రెస్‌పార్టీకి కూడా ఒక తీరనిలోటు. వారు ఏప్రిల్ 21వ తేదీన ఒక రోడ్డు యాక్సిడెంట్‌లో అకాలమరణం చెందటం చాలా బాధాకరమైన విషయం. వారు తెలంగాణా ప్రజల ఆశాజ్యోతి. తెలంగాణా చాలా వెనుకబడిన ప్రాంతమని దాని అభివృద్ధి కొరకు వారు చేసిన కృషి, అహర్నిశలుపడ్డ శ్రమ మరచిపోలేనటువంటిది. వారు నిరాడంబరులు, నిగర్వి, నిస్వార్థపరుడు, అందరికీ మంచి సహాయసహకారాలు అందించే మనసున్నవాడు. ''జై తెలంగాణా'' పెట్టి రాష్ట్రం అంతటా అభిమానులను చూరగొన్న విషయం మనందరకూ తెలిసిందే. మూడు శాఖలకు మంత్రివర్యులుగా వారు చేసిన సేవ మరచిపోలేనటువంటిది. ఆ సందర్భంగా వారు రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులను కూడగట్టుకోవడం జరిగింది. వారి వద్ద ఉండేటువంటి టెలిఫోన్ డైరెక్టరీగురించి చెప్పుకుంటే పెద్ద పుస్తకం వంటిదే ఉండేది. ఆయన ప్రతి చిన్న కార్యకర్త ఫోన్ నంబరు అందులో నోట్ చేసుకుంటూ ఉంటారని కొంతమంది సన్నిహితులు చెప్పటం విన్నాను. వారికి మా కుటుంబంతో 10 సంవత్సరాలుగా సన్నిహిత సంబంధం ఉన్నది. నా భర్త మురళీధర్‌కు వారు మంచి స్నేహితులు. వారు నన్ను తన సొంత చెల్లిలాగా చూసుకునేవారు. నేను శాసనసభ్యురాలిగా ఎన్నికైన తరువాత నన్ను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణానుండి అందులో వరంగల్ జిల్లానుండి వచ్చావు కాబట్టి ఒక ఝాన్సీలక్ష్మీబాయిలాగా, ఒక

రాణీ రుద్రమదేవిలాగా అసెంబ్లీలో పోరాటపటిమ కనపర్చాలని వారు నాకు ధైర్యం, సాహసం కలిగించేవారు. ఏ అంశం మీద మాట్లాడాలన్నా సలహాలు, సూచనలు ఇచ్చేవారు. వారు చనిపోయిన తరువాత 10, 15 రోజులలో ఎలక్షన్ నోటిఫికేషన్ రావటం జరిగింది. ఇతర పార్టీలకు సంబంధించినవారు తమ పార్టీ తరఫున పోటీచేయమని ఇంద్రారెడ్డిగారి భార్య సబితా ఇంద్రారెడ్డిగారి మీద ఒత్తిడి తీసుకువచ్చినా భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించే మహిళగా ఆ ప్రతిపాదనలను తిరస్కరించి కాంగ్రెస్ తరఫుననే పోటీచేసి అత్యధిక మెజారిటీతో వారు గెలిచారు. చిన్నదానినైనా నేను వారికి ఈ విషయంలో కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను. ఏ ఆశయాల కోసం ఇంద్రారెడ్డిగారు పోరాటంచేశారో మీరు తప్పకుండా వారి స్థానంలో నిలబడి ఆ ఆశయాలను పూర్తిచేయటానికి పోరాటం చేయవలసినదిగా నేను కోరుతున్నాను. కాంగ్రెస్ పార్టీ ఎం.ఎల్.ఎ.లు అందరం మీకు అండగా ఉంటాము, ధైర్యాన్ని ఇస్తాము. వారు లేనిలోటును మేమందరం మీవెంట ఉండటం ద్వారా పూర్తిచేస్తాము. వారి ఆశయసాధన కోసం పనిచేయండి. చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు వారి లేని లోటు తీర్చలేనిది. అయినప్పటికీ వారి లోటు కనపడకుండా ఆ స్థానాన్ని భర్తీచేసి వారి ఆశయసాధనకోసం పనిచేయాలని కోరుతున్నాను. మీకు, మీ కుటుంబానికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు భగవంతుడు ఇవ్వాలని, శాంతి చేకూర్చాలని భగవంతుని కోరుతూ ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేసుకుంటూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ వై. రామకృష్ణుడు: అధ్యక్షా, ఇంద్రారెడ్డి మృతి ఈ సభనేకాకుండా మొత్తం ఈ రాష్ట్రాన్నే దిగ్భ్రాంతికి గురిచేసిన విషయం మనందరికీ తెలుసు. ఇంద్రారెడ్డిగారు మొట్టమొదటిసారిగా నాకు 1984లో ఒక మంచి మిత్రునిగా పరిచయం అవ్వటం జరిగింది. ఆ రోజున తెలుగుదేశంపార్టీలో ఒక కార్యకర్తగా ప్రవేశించి తెలుగుదేశంపార్టీ ఆశయాల కొరకు ఆయన చేసిన సేవ ఒకసారి గుర్తుచేసుకుంటే, 1984లో జరిగిన ఆ సంఘటనలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ' అనే నినాదంతో తను ఒక సామాన్య కార్యకర్తగా ఒక మంచి పద్ధతిలో, అంకితభావంతో చక్కగా పనిచేసిన విషయం మనందరకూ తెలిసిందే. ఒక విద్యార్థి నాయకుడిగా ఎదిగి తరువాత లోక్‌దళ్‌లో ప్రవేశించి జాతీయభావాలతో మంచి కార్యకర్తగా ఎదిగారు. తరువాత తెలుగుదేశం పార్టీలో చేరడమే కాకుండా చేవెళ్లనుండి శాసనసభ్యునిగా ఎన్నికకావటం, తరువాత మంత్రివర్గంలో చేరటం తెలిసినదే. కార్యకర్తగా, మంత్రిగా, శాసనసభ్యునిగా ఉన్నప్పుడు కూడా తనకు ఉన్న విధానాలను స్పష్టంగా చెప్పగలిగిన మంచి నాయకుడిని మనం కోల్పోయాం. నాకు అతనితో ఉన్న పరిచయం, అనుభవం చూస్తే ఒక ప్రాంతవాసి దృక్పథం ఉన్న వ్యక్తిగా ఎక్కడా ఆయన నాకు కన్పించలేదు. ఆయన జాతీయ భావాలు కలిగిన వ్యక్తి. దేశంలో, రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రధానమైన సమస్యలగురించి ఆయన ఎప్పుడూ చెబుతూండేవారు. అటువంటి పోరాటతత్వం కలిగిన ఒక మంచి నాయకుడు. పరిస్థితుల ప్రభావంవల్ల ప్రాంతవాసిగా కొన్నికొన్ని విషయాలపట్ల శ్రద్ధచూపించినట్లు కనిపిస్తోంది. ప్రత్యేకంగా ఇంద్రారెడ్డిగారితో మాకున్న పరిచయంతో పరిశీలిస్తే ఒక ప్రాంతవాసిగా ఆయన మాతో ఎన్నడూ లేడనే విషయాన్ని గుర్తుచేస్తున్నాను.

ఉ 11.50

అంతటి మంచి వ్యక్తిని, మంచి భావాలు గల వ్యక్తిని, భావావేశం వున్న ఒక యువ నాయకుడ్ని, మంచి మిత్రుడ్ని కోల్పోయినందుకు నేను ప్రత్యేకంగా, పర్సనల్‌గా ఎంతో బాధ పడుతున్నానని ఈసందర్భంగా మనవి చేస్తున్నాను. ఆయన లేని లోటు ఈ శాసనసభకు ఎంతో వుందని మరొకసారి ఈసందర్భంగా మనవి చేస్తూ, ఇంద్రారెడ్డిగారి కుటుంబానికి ఈ సభా ముఖంగా నాప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తూ, ఈ అవకాశాన్నిచ్చిన మీకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను .

మేడమ్ స్పీకర్ః 'ఆంధ్రప్రదేశ్ శాసనసభా సభ్యులు శ్రీ పి .ఇంద్రారెడ్డిగారి మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.'

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల లోని కౌకుంట్ల గ్రామంలో భూస్వామ్య కుటుంబంలో 1954వ సంవత్సరంలో జన్మించిన శ్రీ పి.ఇంద్రారెడ్డిగారు విద్యార్థి దశలోనే రాజకీయాలవైపు మొగ్గు చూపారు. కళాశాల స్థాయిలో నాయకుడిగా ఎన్నికైన శ్రీ పి. ఇంద్రారెడ్డిగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి నాయకుడిగా కీలకపాత్ర వహించారు. ఎం .ఎ., ఎల్ఎల్.బి., వరకు చదివిన శ్రీ పి.ఇంద్రారెడ్డిగారు తెలంగాణా అభివృద్ధికోసం ఎంతో కృషి చేశారు. మొదటిసారిగా తన స్వగ్రామం కౌకుంట్ల నుంచి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1985 ఎన్నికలలో చేవెళ్ల నుండి పోటీచేసి మొదటిసారిగా శాసనసభ్యునిగా ఎన్నికై తదుపరి 1989, 1994 మరియు 1999 సంవత్సరాలలో జరిగిన ఎన్నికలలో వరుసగా గెలుపొందారు. వీరు శ్రీ ఎన్.టి.రామారావు గారి మంత్రివర్గంలో కార్మిక, విద్యాశాఖ, మరియు హోంశాఖా మాత్యులుగా పనిచేశారు. వీరు నవంబర్,1999 నుండి కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. వీరు శాసనసభలో చాలా చురుకుగా పాల్గొన్నారు. 'జై తెలంగాణా' పార్టీని స్థాపించి తెలంగాణా సమస్యలపై పోరాటం చేశారు.

ఆదర్శ నాయకుడు, పరిపాలనాదక్షుడు అయిన శ్రీ పి.ఇంద్రారెడ్డిగారు అతి చిన్న వయసులో మరణించడం మన రాష్ట్రానికి ఎంతో తీరని లోటు , ఎంతో బాధాకరం. శ్రీ పి.ఇంద్రారెడ్డిగారు 2000, ఏప్రిల్ 21 వ తేదీన మరణించారు. వీరి వయస్సు 45 సంవత్సరములు.

MADAM SPEAKER: Now the question is:

> "That this House places on record its deep sense of sorrow at the demise of Sri P. Indra Reddy, Member of the Andhra Pradesh Legislative Assembly and conveys its deep sense of sympathy to the Members

of the bereaved family."

The motion was adopted *nem con* all Members standing.

MADAM SPEAKER: The House is adjourned to meet again at 9.00 a.m., tomorrow i.e., 10th August, 2000.

[Then the House adjourned at 11.54 a.m., to meet again at 9.00 a.m., tomorrow i.e., 10th August, 2000.]

* * *